


భూ సేకరణను త్వరగా పూర్తి చేయాలి



మాట్లాడుతున్న కలెక్టర్ పి.రంజిత్ బాషా

కర్నూలు కలెక్టరేట్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): రైల్వే ప్రాజెక్టుల నిర్మాణాలకు సంబంధించిన భూసేకరణను త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ పి.రంజిత్ బాషా సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో రైల్వే అండర్ బ్రిడ్జి, రైల్వే ఓవర్ బ్రిడ్జి తదితర రైల్వే ప్రాజెక్టు నిర్మాణ పనుల పురోగతిపై సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. ఆదోని వద్ద నిర్మించనున్న లెవెల్ క్రాసింగ్, కౌతాళం, ఆదోని మండలాల్లోని ఎరిగేరి, కుప్పగల్ గ్రామాల్లో నిర్మించనున్న లెవెల్ క్రాసింగ్, పెద్దకడుబూరు మండలంలోని గవిగట్టు గ్రామంలో నిర్మించనున్న లెవెల్ క్రాసింగ్, కోసిగి మండలం ఐరంగల్ గ్రామం వద్ద లెవెల్ క్రాసింగ్, ఆదోని మండలం కడితోట గ్రామ వద్ద లెవెల్ క్రాసింగ్, హొళగుంద మండలం సాకిబండ గ్రామం వద్ద లెవెల్ క్రాసింగ్, కల్లూరు మండలం లక్ష్మీపురం గ్రామం సమీపంలో నిర్మించనున్న లెవెల్ క్రాసింగ్‌ల పురోగతిపై అధికారులతో చర్చించారు. ఆదోని డివిజన్‌కు సంబంధించి పెండింగ్‌లో ఉన్న లెవెల్ క్రాసింగ్ గేట్స్ ప్రాజెక్టులు 201, 207లను మే నాటికి పూర్తి చేయాలన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ డాక్టర్ బి.నవ్య, అసిస్టెంట్ కలెక్టర్ చల్లా కళ్యాణి, డీఆర్వో సి.వెంకటనారాయణమ్మ, కర్నూలు ఆర్డీవో సందీప్‌కుమార్, ఆర్అండ్‌బీ ఎస్ఈ మహేశ్వరరెడ్డి, రైల్వే అధికారులు పాల్గొన్నారు.

నగర పాలక సంస్థ పీఆర్వో బదిలీ

గూడూరు కమిషనర్‌గా రమేష్‌బాబు



రమేష్‌బాబు

కర్నూలు న్యూసిటీ/ ఎమ్మిగనూరు, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): కర్నూలు నగర పాలక సంస్థ సూపరింటెండెంట్, ప్రజా సంబంధాల అధికారి(పీఆర్వో) రమేష్‌బాబు బదిలీ అయ్యారు. ఆయన్ను గూడూరు నగర పంచాయతీ కమిషనర్‌గా నియమిస్తూ శుక్రవారం పురపాలక శాఖ ప్రధాన కార్యదర్శి ఎస్.సురేష్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. గూడూరు కమిషనర్‌గా పని చేస్తున్న బి.నాగరాజును నగర పాలక సంస్థ శానిటరీ సూపర్‌వైజర్‌గా నియమించారు. కాగా గతంలో రమేష్‌బాబు ఆళ్లగడ్డ, డోన్ మున్సిపాలిటీల్లో కమిషనర్‌గా పని చేశారు. అదేవిధంగా ఎమ్మిగనూరు మున్సిపల్ కమిషనర్‌గా పనిచేస్తున్న గంగిరెడ్డిని బదిలీ చేస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. విజయవాడలోని ఏపీజీబీసీఎల్‌లో పని చేస్తున్న జి.రవిని ఎమ్మిగనూరు మున్సిపల్ కమిషనర్‌గా నియమించారు. గంగిరెడ్డిని సీడీఎంఈకు బదిలీ చేశారు. ఆళ్లగడ్డ మున్సిపల్ కమిషనర్‌గా(ఎఫ్ఏసీ) పని చేస్తున్న కిషోర్‌కు పూర్తి బాధ్యతలు అప్పగించారు. గతంలో ఇక్కడ పని చేస్తున్న కమిషనర్ వెంకటరామిరెడ్డి సెలవుపై వెళ్లడంతో కడప నగరపాలక సంస్థలో సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహిస్తున్న కిషోర్‌ను ఆళ్లగడ్డ మున్సిపల్ కమిషనర్‌గా నియమించిన విషయం తెలిసిందే.

ఎంపీడీవో శివరామయ్యకు రిమాండ్



సస్పెండైన ఎంపీడీఓ శివరామయ్య

బనగానపల్లె, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): బనగానపల్లె ఎంపీడీవోగా పనిచేస్తూ సస్పెండ్ అయిన శివరామయ్యను పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. నందివర్గం ఎస్ఐ వెంకటసుబ్బయ్య కథనం మేరకు.. శివరామయ్య గతంలో పలుకూరు మేజర్ గ్రామ పంచాయతీ ఈవోగా పని చేశారు. అనంతరం బనగానపల్లె మండల ఈవోఆర్డీగా, ఎంపీడీవోగా కూడా విధులు నిర్వర్తించారు. బనగానపల్లె ఎంపీడీవోగా పని చేస్తున్న సమయంలో ప్రభుత్వ ఆదాయానికి గండికొట్టారన్న ఆరోపణలు వచ్చాయి. అలాగే పలుకూరు మేజర్ గ్రామ పంచాయతీ ఈవోగా పని చేసే సమయంలో బిల్ కలెక్టరు పుల్లయ్య ఆత్మహత్య చేసుకున్నాడు. తనను శివరామయ్య పర్మినెంట్ చేస్తానని చెప్పి మోసం చేశారని, ఆత్మహత్యకు ఆయనే కారణమని సూసైడ్ నోట్‌లో పేర్కొన్నాడు. పుల్లయ్య కుమారుడు ఫిర్యాదు మేరకు, పుల్లయ్య సూసైడ్ నోట్ ఆధారంగా పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ మేరకు శివరామయ్యను శుక్రవారం అరెస్టు చేసి కోర్టులో హాజరు పర్చగా జడ్జి రిమాండ్‌కు ఆదేశించారు.

బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై 10న సమీక్ష

శ్రీశైలం, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): శ్రీశైల భ్రమరాంబ మల్లికార్జున స్వామివార్ల మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై ఈ నెల 10న మంత్రుల బృందం సమీక్షించనున్నారని ఈవో ఎం. శ్రీనివాసరావు తెలిపారు. సమీక్షలో రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి, నంద్యాల జిల్లా ఇన్‌చార్జి మంత్రి పయ్యావుల కేశవ్, దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్య ప్రసాద్, హోం శాఖ మంత్రి వి.అనిత, మైనారిటీ శాఖ మంత్రి ఎన్ఎం డి. ఫరూక్, రోడ్లు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి పాల్గొంటారన్నారు. వీరితో పాటు నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి, ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి, దేవదాయ శాఖ కార్యదర్శి, కమిషనర్, కలెక్టర్ తదితరులు సమావేశంలో పాల్గొంటారని ఈవో తెలిపారు.

ఇంటింటికీ మంచినీరు





- జలజీవన్ మిషన్‌లో భారీ అక్రమాలు
- కూటమి రాకతో జేజేఎం పనుల్లో మార్పులు
- జలాశయాల నుంచి నీటి సరఫరాకు ప్రణాళిక
- జిల్లాలో 721 గ్రామాలకు శుద్ధి చేసిన తాగునీరు
- రూ.1,542 కోట్లతో ప్రతిపాదనలు
- 1.77 టీఎంసీలు అవసరమని అంచనా



గ్రామీణ తాగు నీటి సరఫరా విభాగం ఎస్ఈ కార్యాలయం

ఇంటింటికీ కొళాయి కనెక్షన్ల ద్వారా రక్షిత మంచినీరు అందించాలనే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం 'జల జీవన్ మిషన్' తీసుకొచ్చింది. గత వైసీపీ హయాంలో రూ.313.56 కోట్లతో 1,548 పనులు చేపట్టారు. సగం పనులు కూడా పూర్తి చేయకపోగా.. ఆ పనుల్లోనూ భారీ అవినీతి అక్రమాలు జరిగాయి. అంతేకాదు బోర్లు తవ్వి కొళాయి కనెక్షన్లు ఇవ్వడంతో ముప్పాతిక శాతం అలంకారప్రాయంగా మారాయి. టీడీపీ కూటమి ప్రభుత్వం రాగానే గత ప్రభుత్వ ప్రతిపాదనలు రద్దు చేసి జలజీవన్ మిషన్ (జేజేఎం) పనుల్లో సమూల మార్పులకు శ్రీకారం చుట్టింది. సమీప జలాశయాల నుంచి పైపులైన్ల ద్వారా నీటిని తరలించి, 365 రోజులు శుద్ధి చేసిన రక్షిత మంచినీరు సరఫరా చేసేలా డిజైన్లు తయారు చేస్తున్నారు. జిల్లాలో 721 గ్రామాలకు స్వచ్ఛమైన తాగునీరు అందించేదుకు రూ.1,542 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ఆ వివరాలపై ఆంధ్రజ్యోతి ప్రత్యేక కథనం

కర్నూలు, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో 484 గ్రామ పంచాయతీలు, 237 మజారా గ్రామాలు ఉన్నాయి. 33 సమగ్ర రక్షిత మంచినీటి పథకాలు (సీపీడబ్ల్యూఎస్) 351 గ్రామాలకు శుద్ధి చేసిన తాగునీరు సరఫరా చేస్తున్నామని గ్రామీణ తాగునీటి సరఫరా చేస్తున్నట్లు ఇంజనీర్లు పేర్కొంటున్నారు. జిల్లా గ్రామీణ ప్రాంతంలో 3,38,865 జన నివాసాలు ఉంటే నివాసాలు ఉన్నాయి. 2020 ఏప్రిల్ ఒకటో తేదీకి ముందు వరకు కేవలం 60,239 ఇళ్లకు మాత్రమే కొళాయి కనెక్షన్లు ఉన్నాయి. అంటే 82.22 శాతం ప్రజలు వీధికొళాయిలు, బోర్లు, వంకలు, వాగుల్లో చెలిమిలపై ఆధారపడ్డారు. ఇంటింటికి కొళాయి కనెక్షన్ ఇవ్వడంతో పాటు రక్షిత మంచినీరు సఫరా చేయాలనే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం 2020 ఏప్రిల్‌లో 'జలజీవన్ మిషన్ (జేజేఎం)' పథకం తీసుకొచ్చింది. అందుబాటులో ఉన్న నదులు, జలాశయాల ద్వారా శుద్ధి చేసిన నీటిని సరఫరా చేయాల్సి ఉంటే.. గత వైసీపీ హయాంలో అప్పటి ప్రజాప్రతినిధులు, వైసీపీ నాయకులు జలజీవన్ మిషన్‌ను ఆదాయవనరుగా మార్చుకున్నారు. బోర్లు తవ్వి నీటి సరఫరాకు శ్రీకారం చుట్టారు. కొళాయి కనెక్షన్లలో అంకెల గారడి చేసి ప్రజాధనం భారీ ఎత్తున స్వాహా చేశారు.

పల్స్ సర్వే ద్వారా అక్రమాలు వెలుగులోకి

జిల్లాలో జలజీవన్ మిషన్ పథకం అమలుకు ముందు అంటే 2020 ఏప్రిల్ ఒకటో తేదీ వరకు 90,710 ఇళ్లకు కొళాయి కనెక్షన్లు ఉన్నాయని, జేజేఎం కింద మరో 1,31,891 కనెక్షన్లు కలిపి 2,22,601 ఇళ్లకు కొళాయి కనెక్షన్లు (65.69 శాతం) ఇచ్చామని ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజనీర్లు ఐఎంఐఎస్ వెబ్‌సైట్‌లో చూపించారు. అయితే జేజేఎం కింద కొళాయి కనెక్షన్లు ఇవ్వకపోయినా ఇచ్చిన బోగస్ లెక్కలు చూపి భారీగా ప్రజాధనం స్వాహా చేశారని జూలైలో జరిగిన జడ్పీ సమావేశంలో జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు ఏకరువు పెట్టారు. ఇంటింటికి వెళ్లి పల్స్ సర్వే నిర్వహించారు. ఆ సర్వే ప్రకారం 2020 ఏప్రిల్‌కు ముందు 60239 కొళాయి కనెక్షన్లు, జల్ జీవన్ మిషన్ కింద ఇచ్చిన 1,31,894 కనెక్షన్లు కలిపి 1,92,133 ఇళ్లకు కనెక్షన్లు ఉన్నాయని లెక్కలు తేల్చారు. అంటే 30,468 బోగస్ కొళాయి కనెక్షన్లు ఉన్నాయని నిగ్గుతేల్చారు. అయితే జేజేఎం మిషన్ అమలు ముందు ఇచ్చిన కొళాయి కనెక్షన్లు కొన్ని పని చేయడంలేదని, నిర్వహణ లేక నీరు అందడం లేనివి ఉన్నాయని మాయ చేస్తున్నారు. వాస్తవంగా జేజేఎం కింద ఇచ్చిన కొళాయి కనెక్షన్లలో భారీగా బోగస్ కనెక్షన్లు చూపి అందినకాడికి ప్రజా ధనం దోపిడి చేశారనే ఆరోపణలు బలంగా ఉన్నాయి. గత వైసీపీ ప్రభుత్వం ఈ పథకాన్ని ఆదాయ వనరుగా మార్చుకొని అస్తవ్యస్తంగా మార్చేసింది. టీడీపీ కూటమి ప్రభుత్వం వచ్చాక గత ప్రభుత్వం మంజూరు చేసిన జల్ జీవన్ మిషన్ పనులు ఆపేసింది.

మంచి నీరందించడమే లక్ష్యం

టీడీపీ కూటమి ప్రభుత్వం వచ్చాక జలజీవన్ మిషన్ పనుల్లో సమూల మార్పులకు శ్రీకారం చుట్టింది. వేసవి వచ్చిందంటే భూగర్భ జలాలు అడుగంటిపోయి బోర్లు ఒట్టిపోతున్నాయి. బోర్లలో నీటి లభ్యత పూర్తిగా తగ్గిపోతుంది. మార్చి నుంచి ఆగస్టు వరకు ఆరు నెలలు ఇదే పరిస్థితి ఉంటుంది. దీంతో బోర్లపై ఆధార పడకుండా అందుబాటులో ఉన్న నదులు, జలాశయాల నుంచి పైపులైన్ల ద్వారా నీటిని సరఫరా చేసి శుద్ధి చేసి రక్షిత మంచినీరు అందించాలని లక్ష్యంగా సీఎం చంద్రబాబు ప్రభుత్వం ముందుకు వెళ్తుంది. ఖర్చు ఎంతైనా ఫర్వాలేదు. వేసవిలో ఏ సమస్య రాకుండా ఏడాదిలో 365 రోజులు రక్షిత మంచినీరు అందించేందుకు జేజేఎం కింద ప్రతిపాదనలు పంపించాలని ఆదేశాలు జారీ చేశారు. అందులో భాగంగానే జిల్లాలో పులికనుమ రిజర్వాయర్, గాజులదిన్నె ప్రాజెక్టు, పత్తికొండ జలాశయం, గోరుకల్లు జలాశయం నుంచి పైపులైన్ల ద్వారా 1.7707 టీఎంసీలు సరఫరా చేసి శుద్ధి చేసిన రక్షిత తాగునీరు అందించేందుకు రూ.1,542 కోట్లతో ప్రతిపాదనలు పంపారు. ప్రభుత్వం ఆమోదం తెలిపి పనులు చేపడితే వచ్చే రెండేళ్లలో 721 గ్రామాలకు తాగునీటి సమస్య శాశ్వత పరిష్కారం లభించినట్లే. 2057 నాటికి పెరిగే జనాభాకు అనుగుణంగా తాగునీటి సరఫరాకు ప్రాజెక్టు డిజైన్ చేశారు.



గోనెగండ్లలో అసంపూర్తిగా నిలిచిపోయిన ఓహెచ్ఆర్ ట్యాంక్

జల జీవన్ మిషన్ కింద రక్షిత మంచినీటి సరఫరా ప్రతిపాదన వివరాలు

జలాశయం	నియోజక వర్గాలు	మండలాలు	గ్రామాలు	2057 నాటికి జనాభా	అవసరమైన నీరు (టీఎంసీల్లో)	కావాల్సిన నిధులు (రూ.కోట్లల్లో)
పులికనుమ	మంత్రాలయం, ఆదోని	5	163	5,78,576	0.4475	237.00
గాజులదిన్నె	ఎమ్మిగనూరు, కోడుమూరు	7	171	6,77,403	0.5239	330.00
పత్తికొండ	ఆలూరు, పత్తికొండ	11	335	8,79,768	0.6804	705.00
గోరుకల్లు	పాణ్యం	2	52	1,53,682	0.1189	270.00
మొత్తం	7	25	721	22,89,429	1.7707	1,542.00



కోసిగిలో ఇంటింటికీ కొళాయి కనెక్షన్ ఇచ్చేందుకు ఓహెచ్ఆర్ ట్యాంక్ నిర్మాణానికి తీసిన గుంత

అనధికార లేఅవుట్లపై చర్యలు
కుడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు
7
కార్మికుల ప్రయోజనాలు కాపాడుతాం
మార్కెటింగ్ శాఖ జేడీ రామాంజనేయులు
సొసైటీని రద్దు చేయాలి : కాంగ్రెస్

హోరెత్తిన హోసూరు

- ఘనంగా వీరభద్రేశ్వర స్వామి రథోత్సవం



అశేష జనవాహిని నడుమ సాగుతున్న రథోత్సవం

పత్తికొండ, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): పత్తికొండ మండలంలోని హోసూరు గ్రామం వీరభద్రస్వామి నామస్మరణతో మార్మోగింది. వేలాదిగా తరలివచ్చిన భక్తులతో గ్రామం కిక్కిరిసింది. భద్రకాళీ, వీరభద్రేశ్వర స్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం రథోత్సవం కన్నుల పండువగా సాగింది. ఉదయం ఆలయంలో స్వామి, అమ్మవార్ల కల్యాణోత్సవాన్ని వేదమంత్రాల నడుమ నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు స్వామివారికి కానుకలను సమర్పించారు. సాయంత్రం అశేష భక్తజనసందోహం నడుమ రథోత్సవాన్ని కొనసాగించారు. రథోత్సవానికి ముఖ్య అతిథిగా పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు హాజరై మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం రథానికి కొబ్బరికాయకొట్టి రథాన్ని భక్తులతో కలసి ముందుకు లాగారు. ఎమ్మెల్యే వెంట టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి తుగ్గలి నాగేంద్ర, టీడీపీ సీనియర్ నాయకులు సాంబశివారెడ్డి, బత్తిని వెంకట్రాముడు, రామానాయుడు, నాయకులు రాజశేఖర్, వాకిటిసాయి, జగ్గలఅంజి, రాఘవేంద్ర, కిష్టన్న తదితరులు పాల్గొన్నారు. రథోత్సవం సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా సీఐ జయన్న సిబ్బందితో బందోబస్తును పర్యవేక్షించారు.



ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

వైభవంగా శ్రీవారి కల్యాణోత్సవం



శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి కల్యాణం

కర్నూలు కల్చరల్, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): నగరంలోని సంకల్‌బాగ్‌లో తుంగభద్ర నదీతీరాన వెలసిన శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో కొనసాగుతున్న శ్రీవారి 19వ వార్షిక బ్రహ్మోత్సవాల్లో శుక్రవారం స్వామి, అమ్మవార్ల కల్యా ణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఉదయం 9 గంటలకు ఆలయంలో వేదిక ఏర్పాటు చేసి, స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులకు శాస్త్రోక్తంగా కల్యాణం నిర్వహించారు. లోక కల్యాణార్థం పంచసూక్త హోమం నిర్వహించారు. అనం తరం టీటీడీ వేద పండితుడు, ఘనాపాటి కమలసాయినాథ శర్మ నేతృత్వంలో రాజేశ్ శర్మ, విజయకుమార్ శర్మ, దీపక్‌శర్మ, ప్రసన్న శర్మ కల్యాణ వేడుకలను నిర్వహించారు. పండితుడు వేణుగోపాల శర్మ శ్రీవారి కల్యాణ వేడుకల విశిష్టతను తెలియజేస్తూ, ప్రవచన బోధన చేశారు. రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్ సతీమణి టీజీ రాజ్యలక్ష్మి, బీఎస్ఎన్ఎల్ సంస్థ జిల్లా జనరల్ మేనేజర్ రమేశ్, ఏజీఎం శ్రీనివాసనాయక్, కరివేన బ్రాహ్మణ నిత్య అన్నదాన సత్రం ప్రధాన కార్యదర్శి డాక్టర్ వేణుగోపాల్, ఏపీ బ్రాహ్మణ సంక్షేమ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు వెంకటరామరాజు తదితరులు హాజరయ్యారు. కార్యక్రమంలో ఆలయ అధ్యక్ష, గౌరవాధ్యక్షులు సండేల్ చంద్రశేఖర్, సీవీ దుర్గాప్రసాద్, సభ్యులు చల్లా నాగరాజు శర్మ, శ్యామసుందర రావు, రాజశేఖర్ రావు, సీఎస్ ప్రసాదరావు, టీవీ రవిచంద్ర శర్మ ఆధ్వర్యంలో భక్తులకు ఏర్పాట్లు చేశారు. రాత్రి స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తుల శోభాయాత్ర నిర్వహించారు.



హాజరైన భక్తులు

నేడు బ్రహ్మోత్సవాల ముగింపు...

హరిహర క్షేత్రంలో పది రోజులుగా కొనసాగుతున్న శ్రీవారి 19వ వార్షిక బ్రహ్మోత్సవాలు శనివారం ముగియను న్నాయి. తుంగభద్ర నదిలో స్వామివారికి చక్రస్నాన మహోత్సవాన్ని నిర్వహిస్తున్నారు.



రాయితీ ఇంధనం

● పెట్రోల్, డీజిల్ ఖర్చులో 50 శాతం సబ్సిడీ ● దివ్యాంగులు అర్హులు

కర్నూలు కలెక్టరేట్, పిబ్రవరి 7: (ఆంధ్రజ్యోతి): దివ్యాంగుల వాహనాలకు ప్రభుత్వం 50శాతం రాయితీపై పెట్రోల్, డీజిల్ అందించనుంది. స్వయం ఉపాధి పొందుతూ, ప్రైవేటు ఉద్యోగాలు చేస్తూ జీవనం సాగిస్తున్న దివ్యాంగులకు ఈ పథకం వర్తిస్తుంది. ఒక్కొక్క లబ్ధిదారునికి గరిష్ఠంగా నెలకు రూ.2వేలు వరకు లబ్ధి చేకూరుతుంది. ఈ ఆర్థిక తోడ్పాటుతో దివ్యాంగులు కాస్త నిలదొక్కుకునేలా ప్రభుత్వం ప్రోత్సాహం అందించింది. మూడు చక్రాల మోటారు వాహనాలు వినియోగించే దివ్యాంగులకు ఇంధనం భారం లేకుండా చేసేందుకు 2014-19లోనే నాటి తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో రాయితీపై పెట్రోల్, డీజిల్ అందించే పథకాన్ని అమలు చేశారు. అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం దీన్ని నిర్లక్ష్యం చేసింది. ఈ పథకం కోసం కేటాయించిన నిధులను పూర్తి స్థాయిలో ఖర్చు చేయలేదు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం దీన్ని పునరుద్ధరించి దివ్యాంగులకు లబ్ధి చేకూర్చేందుకు చర్యలు చేపట్టింది.

విద్యార్థులు అయితే స్టడీ సర్టిఫికెట్, ప్రైవేటు వ్యక్తులైతే సంబంధిత కార్యాలయంలో పని చేస్తున్న అధికారి చేత ఎక్స్‌పీరియన్స్ సర్టిఫికెట్ తీసుకోవాలి. వ్యాపారులైతే ఎంపీడీవో ద్వారా లేదా సంబంధిత పంచాయతీ సెక్రటరీ ద్వారా ధ్రువీకరణ పత్రం పొందాలి. దరఖాస్తు ఫారాన్ని జిల్లా వయోవృద్ధుల విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ శాఖ కార్యాలయంలో సమర్పించాల్సి ఉంటుంది.

కావాల్సిన ధ్రువపత్రాలు

- దరఖాస్తు ఫారం
- సదరం సర్టిఫికెట్
- రేషన్‌కార్డు
- బ్యాంక్ పాస్ పుస్తకం (మొదటి పేజీ)
- ఆధార్ కార్డు
- వ్యాపారం లేదా ఏదైనా సంస్థలో పని చేస్తున్నట్లు ధ్రువీకరణ పత్రం
- డ్రైవింగ్ లైసెన్సు
- వాహన రిజిస్ట్రేషన్ పత్రం

30 లీటర్ల ఇంధనం రాయితీ

2 హెచ్‌పీ సామర్థ్యం కలిగిన వాహనాలకు నెలకు గరిష్ఠంగా 15 లీటర్లు, అంతకంటే ఎక్కువ సామర్థ్యం కలిగిన వాహనాలకు 30 లీటర్ల వరకు ఇంధన రాయితీ వర్తింపజేయనున్నారు. దీనికి సంబంధించిన బిల్లులను మూడు నెలలకు ఒకసారి సమర్పించాల్సి ఉంటుంది. తర్వాత రాయితీ సొమ్మును నేరుగా లబ్ధిదారుడి ఖాతాకే ప్రభుత్వం జమ చేయనున్నది. లబ్ధిదారుడు ఇంటి నుంచి తాను పని చేసే ప్రదేశానికి వెళ్లే దూరానికి వినియోగించే పెట్రోల్, డీజిల్ ఖర్చులో 50 శాతం రాయితీ అందిస్తారు.

దరఖాస్తు చేసుకోవాలి



దివ్యాంగుల వాహనాలకు కూటమి ప్రభుత్వం 50 శాతం రాయితీపై పెట్రోల్, డీజిల్‌ను అందించనుంది. స్వయం ఉపాధి పొందుతూ ప్రైవేటు ఉద్యోగం చేస్తూ జీవనం సాగిస్తున్న దివ్యాంగులకు ఈ పథకం వర్తించనున్నది. జిల్లాలోని అర్హులైన దివ్యాంగుల వాహనదారులు రాయితీ ఇందనం కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు.

-రయీస్ ఫాతిమా, వయోవృద్ధులు, విభిన్న ప్రతిభావంతుల జిల్లా సంక్షేమ అధికారి

రేపటి నుంచి ఘంటసాల ఆరాధనోత్సవాలు

కర్నూలు కల్చరల్, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): తెలుగు సినీ నేపథ్య గాయకుడు, దివంగత ఘంటసాల వర్ధంతిని పురస్కరించుకొని ఆదివారం నుంచి మంగళవారం వరకు నగరంలోని టీజీవీ కళాక్షేత్రంలో 'ఘంటసాల ఆరాధనోత్సవాలు' నిర్వహించనున్నట్లు కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య, ఘంటసాల గాన కళాసమితి అధ్యక్షుడు బీఎస్ రావు తెలిపారు. శుక్రవారం వారు మాట్లాడుతూ టీజీవీ కళాక్షేత్రం, ఘంటసాల గాన కళాసమితి సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ మూడు రోజుల ఘంటసాల ఆరాధనోత్సవాల్లో ఆదివారం సాయంత్రం 6.30 గంటలకు కర్నూలు గాయకులు సుధారాణి, శ్రీనివాసులు, హబీబ్ తదితరులు ఆధ్వర్యంలో సంగీత విభావరి ఉంటుందని తెలిపారు. కన్వీనర్‌గా గాయకుడు చంద్రకంటి మద్దయ్య వ్యవహరిస్తారని తెలిపారు. సోమవారం సాయంత్రం 6.30 గంటలకు హైదరాబాదుకు చెందిన గాయకులు అఖిల, పీవీ రమణ బృందం ఆధ్వర్యంలో సంగీత విభావరి ఉంటుందని, కన్వీనర్‌గా బీఎస్ రావు వ్యవహరిస్తారని తెలిపారు. మంగళవారం సాయంత్రం 6.30 గంటలకు హైదరాబాదు గాయకులు వాణికుమారి, వీరలక్ష్మి, పి. రవీందర్, డాక్టర్ వీఎస్ మూర్తిల బృందం ఆధ్వర్యంలో జరిగే సంగీత విభావరికి హైదరాబాదు ఘంటసాల గానసభ అధ్యక్షుడు డాక్టర్ కేవీ రావు కన్వీనర్‌గా వ్యవహరిస్తారని వారు వివరించారు.

నేడు, రేపు విరసం 24వ 'సాహిత్య పాఠశాల'

హాజరవుతున్న ప్రముఖ కవులు, రచయితలు

కర్నూలు కల్చరల్, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): విప్లవ రచయిత సంఘం (విరసం) ఆధ్వర్యంలో 24వ సాహిత్య పాఠశాలను 'సంక్షోభ కాలంలో సాహిత్యకారుల పాత్ర' అనే అంశంపై నిర్వహిస్తున్నట్లు విరసం నాయకులు పాణి, నాగేశ్వరాచారి తెలిపారు. శనివారం, ఆదివారం రెండు రోజుల పాటు నగరంలోని గుత్తి పెట్రోల్ బంక్ పక్కనగల వెంకటేశ్వర కల్యాణ మంటపం వేదికగా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇటీవల మరణించిన కవి, విప్లవ మేధావి, ప్రొఫెసర్ జీఎన్ సాయిబాబా స్మృతిపథంలో ఈ వేదికకు 'కామ్రేడ్ సాయిబాబా ప్రాంగణం'గా నామకరణం చేశామని చెప్పారు. శనివారం ఉదయం 10.30 గంటలకు పతాక ఆవిష్కరణ, 11 గంటలకు అరుణ్ ఆహ్వానం, అరసవిల్లి కృష్ణ అధ్యక్షతన తొలి సమావేశం నిర్వహిస్తున్నామని తెలిపారు. అమరుడు ప్రొఫెసర్ సాయిబాబా సహచరి వసంతకుమారి ప్రారంభోపన్యాసం చేస్తారని అన్నారు. అనంతరం ఆయా అంశాలపై వక్తలు ప్రసగిస్తారని పేర్కొన్నారు. అలాగే ఆదివారం ఉదయం 10 గంటలకు పుస్తక ఆవిష్కరణ, 11.30 గంటలకు వరలక్ష్మి అధ్యక్షతన 'తెలుగు సాహిత్యంలో వెలుగు నీడలు' అనే అంశంపై అరసవిల్లి కృష్ణ, మధ్యాహ్నం 2.30 గంటలకు సాగర్ అధ్యక్షతన 'విప్లవోద్యమంపై ఫాసిస్టు యుద్ధం - రచయితలు, బుద్ధిజీవుల పాత్ర' అనే అంశంపై పాణి ప్రసంగిస్తారని తెలిపారు. సాయంత్రం 4.30 గంటలకు ఊరేగింపు, 5.30 గంటలకు జరిగే బహిరంగ సభకు కె. నాగేశ్వరాచారి అధ్యక్షత వహిస్తారని, వక్తలుగా జి. కల్యాణరావు, శశికళ, ప్రొఫెసర్ హరగోపాల్, బొజ్జా దశరథరామిరెడ్డి (రాయలసీమ సాగునీటి సాధన సమితి) ప్రసంగిస్తారని పేర్కొన్నారు.

ఉరకలేసిన ఉత్సాహం

ముగిసిన బాలోత్సవం



ముగింపు వేడుకల్లో మాట్లాడుతున్న డీఈఓ

కర్నూలు ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 7: (ఆంధ్రజ్యోతి): నగర శివారులోని ఇండస్ పాఠశాల వేదికగా రెండు రోజుల పాటు సాగిన బాలోత్సవం శుక్రవారం ముగుసింది. రెండో రోజు 27 అంశాల్లో పోటీలను నిర్వహించారు. మూడు వేల మంది విద్యార్థులు హాజరయ్యారు. జానపద నృత్యం, విచిత్ర వేషధారణ, ఏకపాత్రాభినయం, కోలాటం నిర్వహించారు. మధ్యాహ్నం బాలోత్సవం అధ్యక్షులు బడే సాహెబ్ అధ్యక్షతన ముగింపు సభ నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా విద్యాశాఖ అధికారి శ్యామ్యూల్ పాల్ మాట్లాడుతూ విద్యార్థులు బాలోత్సవంలో పాల్గొనడం విద్యా శాఖకే గర్వకారణమన్నారు. పిల్లలను ప్రోత్సహిస్తున్న తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు అభినందనలు తెలిపారు. పిల్లల్లోని సృజనాత్మకత, శాస్త్రీయ దృక్పథాన్ని బయటకు తీయడానికి ఈ కార్యక్రమం దోహదపడుతుందని తెలిపారు. గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టు డాక్టర్ బి.శంకర్‌శర్మ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం బాలోత్సవంలో పాల్గొనే విద్యార్థులు, పోటీ అంశాల సంఖ్య పెరుగుతూనే ఉందన్నారు. పిల్లల్లోని సృజనాత్మకతను వెలికితీయాలనే సదుద్దేశం బాలోత్సవం వెనుక ఉందని తెలిపారు. ఇలాంటి కార్యక్రమాలు ప్రమాదకరమైన సెల్‌ఫోన్ల నుంచి దూరంగా ఉండేందుకు సహాయ పడతాయన్నారు. ఎండోక్రైనాలజిస్టు డాక్టర్ భరత్ మాట్లాడుతూ బాలోత్సవం పెద్ద ఈవెంటుగా మారిందన్నారు. పిల్లలను చిన్నప్పటి నుంచి సృజనాత్మకతను పెంచేందుకు ఈ కార్యక్రమం సహాయ పడుతుందన్నారు. ఏపీఎస్పీ బెటాలియన్ డీఎస్పీ మహబూబ్‌బాషా మాట్లాడుతూ ఈ వేడుకల్లో పాల్గొనేందుకు పిల్లలు తపన పడుతున్నారని, అంతే బాగా ప్రదర్శనలు ఇస్తున్నారని అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని ఆణిముత్యాలను కూడా బయటకు తీయడానికి కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు. ఈ సందర్భంగా డీ టైటిల్ విన్నర్, ఆర్టిస్ట్ హేమంత్ ప్రదర్శించిన నవరసాలతో కూడిన డాన్స్ ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో బాలోత్సవ కమిటీ రాష్ట్ర నాయకులు రామరాజు, మాంటిస్సోరి విద్యాసంస్థల సీఈవో విల్సన్, ప్రిన్సిపాల్ మీనాక్షి విల్సన్ యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు కే సురేష్ కుమార్, బాలోత్సవం కన్వీనర్ ధనుంజయ, ప్రధాన కార్యదర్శి శేషయ్య, ప్లానింగ్ కన్వీనర్ కెంగార మోహన్, యూటీఎఫ్ సీనియర్ నాయకులు జయరాజు, జిల్లా అధ్యక్షులు రవికుమార్, ప్రధాన కార్యదర్శి నవీన్ పాటి, జన విజ్ఞాన జిల్లా అధ్యక్షులు సుధీర్‌రాజు, రిటైర్డ్ హెచ్‌ఎం ఈ.పాండురంగయ్య తదితరులు పాల్గొన్నారు.



డ్యాన్సర్ హేమంత్ ప్రదర్శన

క్రీడాకారులకు నజరానా

కర్నూలు స్పోర్ట్స్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): గోవాలో గత ఏడాది జరిగిన జాతీయ క్రీడలతోపాటు వివిధ క్రీడల్లో జాతీయ స్థాయిలో పతకాలు సాధించిన 189 మంది క్రీడాకారులకు రాష్ట్ర ప్రభుత్వం రూ.7.91 కోట్ల నజరానాలను మంజూరు చేసింది. గత ఏడాది హామీకే పరిమితమైన క్రీడా పురస్కారాలు ముఖ్యమంత్రి చంద్రబాబు చొరవతో శుక్రవారం పతకాలు సాధించిన క్రీడాకారుల ఖాతాల్లో అధికారులు జమ చేశారని జిల్లా ఒలింపిక్ సంఘం కార్యదర్శి శ్రీనివాసులు తెలిపారు. ఒలింపిక్ అసోసియేషన్ ట్రెజరర్ శ్రీధర్, సంయుక్త కార్యదర్శి శ్రీనివాసులు, అవినాష్ శెట్టి, సునీల్, పాల్గొన్నారు.

పాడి రైతుకు భరోసా..

● లక్ష్యానికి మించి దరఖాస్తులు
● పశు కిసాన్ క్రెడిట్ కార్డుల రుణ పరిమితి రూ.మూడు లక్షల నుంచి రూ. ఐదు లక్షలకు పెంపు వల్లే



కర్నూలు అగ్రికల్చర్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయంతో నష్టాలపాలవుతున్న రైతులను ఆదుకునేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెద్ద ఎత్తున పథకాలను అమలు చేస్తున్నాయి. ఉపాధి హామీ పథకం ద్వారా రాష్ట్ర ప్రభుత్వం ఉమ్మడి కర్నూలు జిల్లాలో మూగ జీవాలకు నీడ కల్పించడంతో పాటు పశుగ్రాసం సమకూర్చుకునేందుకు పెద్ద ఎత్తున సీఎం చంద్రబాబు నాయుడు నిధులను కేటాయించారు. ఉమ్మడి జిల్లాలో 2,200 గోకులాల షెడ్లను రైతులు ఏర్పాటు చేసుకునేందుకు నిధులను సమకూర్చారు. అదేవిధంగా పాడి రైతులకు పశుకిసాన్ క్రెడిట్ కార్డుల రుణ పరిమితిని కేంద్ర ప్రభుత్వం రూ.3 లక్షల నుంచి రూ.5 లక్షలకు పెంచడంతో రైతులు రుణం కోసం బ్యాంకుల వద్ద క్యూ కడుతున్నారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో దాదాపు ఎనిమిదివేల పశువులు, 20వేల జీవాలు ఉన్నట్లు పశుసంవర్ధక శాఖ అధికారులు తెలిపారు. పాడి రైతులకు దానాతో పాటు మేత కొనుగోళ్లకు గడ్డి కత్తిరించే యంత్రాలకు కూడా డబ్బులు లేక ఇబ్బందులు పడుతున్న పరిస్థితుల్లో రైతులు ఉన్నారు. ఈ ఇబ్బందులను తొలగించేందుకు కేంద్ర ప్రభుత్వం గతేడాది నుంచి పశుకిసాన్ క్రెడిట్ కార్డుల మంజూరుకు అవకాశం కల్పించింది. కర్నూలు జిల్లాలో ఈ సంవత్సరం 6,676 పశుకిసాన్ క్రెడిట్ కార్డులను రైతులకు అందించాలనే లక్ష్యం కాగా, రైతుల నుంచి విశేష స్పందన లభించినట్లు పశుసంవర్ధకశాఖ జేడీ శ్రీనివాస్ తెలిపారు. ఏకంగా 13,433 దరఖాస్తులు రైతుల నుంచి అందాయని, వీటిని బ్యాంకులకు పంపామని, త్వరలోనే రుణాలు మంజూరవుతాయని తెలిపారు. అదేవిధంగా నంద్యాల జిల్లాలో 7,300 పశుకిసాన్ క్రెడిట్ కార్డులను రైతులకు పంపిణీ చేసే లక్ష్యం కాగా 9,596 దరఖాస్తులు వచ్చాయని, దరఖాస్తులను బ్యాంకులకు పంపామని, త్వరలోనే రుణాలు మంజూరవుతాయన్నారు. ఇటీవల వరకు గరిష్ఠంగా ఒక్కో రైతుకు యూనిట్ ఏర్పాటు చేసుకునేందుకు రూ.1.6 లక్షల రుణం ఎలాంటి హామీ లేకుండా బ్యాంకులు ఇస్తున్నాయనీ, దీనిని జనవరి నుంచి రూ. రెండు లక్షల వరకు పెంచిందని జేడీ శ్రీనివాస్ తెలిపారు. ఆ పై మొత్తానికి బ్యాంకులకు తప్పనిసరిగా పూచీకత్తు రైతులు చూపించాల్సి వచ్చేదన్నారు. ప్రస్తుతం రుణ మొత్తాన్ని రూ.3లక్షల నుంచి రూ.5 లక్షల వరకు పెంచడం వల్ల రూ. 2 లక్షల రుణం వరకు ఎటువంటి పూచి రైతులు బ్యాంకులు ఇవ్వాల్సిన అవసరం లేదన్నారు. ఈ కార్డులు ఉంటే రైతులు అవసరమైన సమయంలో బ్యాంకుల్లో నగదు తీసుకుని పశుపోషణ వనరులు సమకూర్చుకోవచ్చని, తీసుకున్న సొమ్మును 40 రోజుల్లో తిరిగి చెల్లిస్తే ఎలాంటి వడ్డీ ఉండదని, ఆ పై చెల్లిస్తే 40 శాతం వడ్డీ బ్యాంకులు వసూళ్ల చేస్తాయన్నారు. ఇందులో మూడు శాతం ప్రభుత్వం రాయితీగా అందించడం వల్ల తక్కువ వడ్డీతో రైతులు పాడిపరిశ్రమ ద్వారా జీవనోపాధిని మెరుగుపరుచుకోవచ్చని జేడీ తెలిపారు.

టీఎల్‌ఎంతోనే విద్యార్థుల అభ్యసన స్థాయి మెరుగు : డీఈవో



మాట్లాడుతున్న డీఈవో శ్యామ్యూల్ పాల్

కర్నూలు ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 7: (ఆంధ్రజ్యోతి): ప్రాథమిక స్థాయిలో విద్యార్థుల అభ్యసన స్థాయి మెరుగు పడాలంటే కచ్చితంగా బోధన అభ్యసన సామగ్రిని వినియోగించాలని జిల్లా విద్యాశాఖ అధికారి శామ్యూల్ పాల్ అన్నారు. శుక్రవారం స్థానిక రాఘవేంద్ర బీఈడీ కళాశాలలో ఉమ్మడి కర్నూలు జిల్లా ఎఫ్‌ఎల్‌ఎన్ ఆరు రోజుల శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు ఒకరి అనుభవాలు మరొకరితో పంచుకోవడానికి రెసిడెన్షియల్ శిక్షణ కార్యక్రమాలపై సానుకూల ధోరణి కలిగి ఉండాలని వివరించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో భాగంగా టీఎల్‌ఎం మేళాను సందర్శించి ఉపాధ్యాయులు తయారు చేసిన టీచర్స్ లెర్నింగ్ మెటీరియల్స్‌ను చూసి అభినందించారు. శిక్షణలో నేర్చుకున్న అంశాలను పాఠశాలల్లో అమలు చేసే బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. మేళాలో ప్రదర్శించిన నమూనాలు విద్యార్థుల్లో ఆసక్తి రేకెత్తించే విధంగా ఉన్నాయని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో డా.రఫీ, జిల్లా కోఆర్డినేటర్ దావీదు, కేఆర్పీలు, డీఆర్పీలు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పాల కల్తీపై లోకాయుక్త సీరియస్

కర్నూలు లీగల్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): అనంతపురం జిల్లాలో జరుగుతున్న పాల కల్తీ వ్యాపారంపై ఈ నెల 5వ తేదీన ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి రాష్ట్ర లోకాయుక్త తీవ్రంగా స్పందించింది. ఈ మేరకు ఆంధ్రజ్యోతి కథనాన్ని రాష్ట్ర ఉప లోకాయుక్త పి.రజని సుమోటోగా స్వీకరించి తగు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఆహార భద్రతా కమిషనర్‌కు నోటీసులు జారీ చేసింది. అనంతపురం జిల్లా రాప్తాడు మండలం బండమీదపల్లితో పాటు అనంతపురం నగరంలోని పలు పాల కేంద్రాల్లో మాల్టోడెక్సిన్ అనే రసాయన పౌడర్‌ను పాలలో కలిపి విక్రయిస్తుండగా.. విజిలెన్స్ అధికారులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో మాల్టోడెక్సిన్ పౌడర్‌ను స్వాధీనం చేసుకుని పాల కేంద్రాలను సీజ్ చేశారు. ఈ వ్యవహారంపై ఆంధ్రజ్యోతిలో కథనాలు రావడంతో రాష్ట్ర ఉప లోకాయుక్త పి.రజని తీవ్రంగా స్పందించారు. పాల కల్తీని అరికట్టేందుకు తీసుకోవాల్సిన చర్యలు తెలియజేస్తూ రాష్ట్ర ఆహార భద్రత కమిషనర్‌కు నోటీసులు జారీ చేసి కేసును మార్చి 24వ తేదీకి వాయిదా వేశారు.

శ్రీశైల క్షేత్రంలో తాడిపత్రి ఎమ్మెల్యే కుటుంబం

బంగారు కూర్మ సింహాసనం, పల్లెం సమర్పణ

శ్రీశైలం, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): శ్రీశైల మల్లికార్జున, భ్రమరాంబ అమ్మవార్లను అనంతపురం జిల్లా తాడిపత్రి ఎమ్మెల్యే జేసీ అస్మిత్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్ రెడ్డిలు శుక్రవారం కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి బంగారుతో తయారు చేసిన కూర్మ సింహాసనం, పల్లెంను సమర్పించారు. 379 గ్రాములతో తయారు చేసిన కూర్మ సింహాసనం, 249 గ్రాములతో తయారు చేసిన బంగారు పళ్లెంను అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి ఈఓ ఎం.శ్రీనివాసరావుకు దాతలు అందజేశారు. ఈ సందర్భంగా జేసీ అస్మిత్ రెడ్డి, జేసీ ప్రభాకర్ రెడ్డిలను శేష వస్త్రంతో ఆలయ అధికారులు, పూజాలు సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు మార్కండేయ శాస్త్రి, ఏఈఓ మల్లికార్జునరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఆలయ అధికారులకు బంగారు వస్తువులను అందజేస్తున్న ఎమ్మెల్యే జేసీ అస్మిత్ రెడ్డి కుటుంబ సభ్యులు

ఐదెకరాల్లో ఆలయం



డోన్‌లో నిర్మించిన షిరిడీ సాయిబాబా ఆలయం

● డోన్‌లో నిర్మితమైన షిరిడీ సాయిబాబా మందిరం
● వందలాది మంది భక్తుల సహకారంతో పూర్తి
● 9 నుంచి 12 వరకు ప్రత్యేక పూజలు
● 13న విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ

డోన్ టౌన్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): ఐదు ఎకరాల్లో పూర్తి చేసుకున్న అద్భుత నిర్మాణం.. దాతల సహకారం ఏర్పాటైన షిరిడీ సాయిబాబా ఆలయం.. 13న విగ్రహ ప్రాణ ప్రతిష్ఠకు సిద్ధమవుతోంది. డోన్ పట్టణ సమీపంలోని 44వ నెంబరు జాతీయ రహదారి పక్కన నిర్మించిన షిరిడీ సాయిబాబా విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ మహోత్సవం ఈ నెల 9వ తేదీ నుంచి 13 వరకు జరగనుంది. ఇందుకు షిరిడీ సాయిబాబా సేవా సమితి ఆధ్వర్యంలో చకచకా ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఆలయ నిర్మాణానికి 2016లో పునాదిరాయి పడగా ఆ తరువాత వందలాది మంది భక్తులు ఆలయ నిర్మాణంలో భాగస్వామ్యులయ్యారు. ఈ కరోనా సమయంలో కాస్త నిర్మాణం ఆలస్యమైనప్పటికీ చివరకు దాదాపు రూ.7 కోట్లతో తుది దశకు చేరుకుంది. షిరిడీ తర్వాత అత్యంత అధిక విస్తీర్ణం కలిగిన ఆలయంగా తీర్చిదిద్దారు. 120 అడుగులతో ఆలయ గోపురం నిర్మించారు. షిరిడీ సాయిబాబా ఆలయ కమిటీ చైర్మన్ రాష్ట్ర సీడ్స్ కార్పొరేషన్ డెవలప్‌మెంట్ చైర్మన్ ధర్మవరం సుబ్బారెడ్డి, కమిటీ సభ్యులు భాష్యం వెంకట రమణగౌడు, చాటకొండ శ్రీనివాసులు, కందుకూరు పార్థసారథి, కొండా సురేష్, అడ్వకేట్ ఆలా మల్లికార్జున రెడ్డి, శ్రీరాములు కమిటీ సభ్యులుగా వ్యవహరిస్తున్నారు.

అందరి సహకారంతోనే..



డోన్ పట్టణంలోని హైవే రోడ్డులో షిరిడీ సాయిబాబా ఆలయ నిర్మాణం భక్తులందరి సహకారంతో పూర్తి చేశాం. ఈ నెల 9 నుంచి 12 వరకు ప్రత్యేక పూజలు, 13న ప్రాణప్రతిష్ఠ కార్యక్రమాలు జరుగుతాయి. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని వేడుకలను జయప్రదం చేయాలని భక్తులను విజ్ఞప్తి చేస్తున్నాం. విచ్చేసిన భక్తులకు తీర్థ ప్రసాదం, అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తాం. ఈ ఆలయ నిర్మాణానికి సహకరించిన కమిటీ సభ్యులకు, భక్తులకు ప్రతి ఒక్కరికీ ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నాం.

- ధర్మవరం సుబ్బారెడ్డి, సాయిబాబా ఆలయ కమిటీ చైర్మన్

2016లో పునాదిరాయి

ఆలయ నిర్మాణానికి 2005లో ఐదెకరాల భూమిని సేకరించారు. 2016లో పునాదిరాయి పడింది. అదే సంవత్సరంలో భూమి పూజా కార్యక్రమం అశేష భక్త జనవాహిని మధ్య జరిగింది. అదే సంవత్సరంలో ఆలయ భూమి పూజ కార్యక్రమం వైభవంగా జరిగింది. టీడీపీ సీనియర్ నాయకుడు కేఈ ప్రతాప్ దంపతులు, ప్రస్తుత రాష్ట్ర సీడ్స్ కార్పొరేషన్ డైరెక్టర్ ధర్మవరం సుబ్బారెడ్డి, మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి, కేఈ జయన్న, మాజీ మున్సిపల్ చైర్మన్ కోట్రికే గాయత్రీదేవి, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ మురళీకృష్ణగౌడు, భాష్యం వెంకటరమణగౌడు తదితర నాయకులు, వేలాది భక్తుల మధ్య డోన్ మీదుగా భారీ ర్యాలీగా వెళ్లి భూమి పూజ కార్యక్రమం నిర్వహించారు.

మానవ రూపంలో ఉన్న మహానీయుడు



సాయిబాబా లీలలు అద్భుతం. మానవ రూపంలో ఉన్న మహనీయుడు. ప్రజల మధ్య తిరుగుతూ మహిమలను చూపించిన మహిమాన్వితుడు. సాయిబాబాపై భక్తితో ఆలయ సమీపంలోనే ఇల్లు నిర్మించుకొని ఉండటం అదృష్టంగా భావిస్తున్నాం. డోన్‌లో సాయిబాబా మందిరం ఏర్పాటు చేయడం చాలా ఆనందంగా ఉంది.

- సముద్రాల మాధవీలత, సాక్షి గ్రీన్ పార్కు, కాలనీవాసి, డోన్

ఆలయం నిర్మించడం సంతోషంగా ఉంది



డోన్‌లో హైవే సమీపంలో షిరిడీ సాయిబాబా ఆలయం నిర్మాణం చేపట్టడం సంతోషంగా ఉంది. ఆలయం నిర్మాణంలో డోన్‌కు ఒక ప్రత్యేకత లభించింది. సాయిబాబా ఒక శక్తి సంపన్నుడు. కులమతాలకతీతంగా అందరినీ దగ్గరకు తీసుకున్న మహిమాన్వితుడు. యేసు, అల్లా, ఈశ్వరుడు అంతా ఒక్కటే అని చాటిచెప్పిన మహాయోగి సాయిబాబా.

- రాంపుల్లయ్య, వ్యాపారవేత్త, టీచర్స్ కాలనీ, డోన్



జూపాడుబంగ్లా కేసీ కాల్వ వంతెనపై అడ్డుగా ఉన్న గేదెలు

పశువులతో నిరసన

జూపాడుబంగ్లా, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): గేదెల యజమానులకు కోపం రావడంతో ఆ పశువులను జాతీయ రహదారిపై అడ్డంగా వదిలి నిరసన వ్యక్తం చేసిన సంఘటన జూపాడుబంగ్లా మండలంలో శుక్రవారం చోటు చేసుకుంది. జూపాడుబంగ్లాకు గేదెలను కేసీకాల్వ ఆయకట్టు కింద పంటల నూర్పిడి అనంతరం ఎన్నో ఏళ్ల నుంచి గేదెలు మేపుకుంటున్నారు. వారం రోజుల నుంచి 80బన్నూరు పొలిమేరలోకి పశువులు రాకూడదని గ్రామస్థులు చెప్పారంటూ కావలిదారు అడ్డుకుంటున్నారు. శుక్రవారం కూడా అదే తరహాలో అడ్డుకోవడంతో పశువుల యజమానులంతా తిరగబడ్డారు. కేసీకాల్వ వంతెనపై అడ్డుకోవడంతో జాతీయ రహదారిపై వాహనాలు నిలిచిపోయాయి. దాదాపు అరగంట పాటు తీవ్రఅంతరాయం కలిగింది. ఈ సమయంలో ఓ వాహనం గేదెలను ఢీకొనడంతో ఓ గేదెకు కాలు విరిగింది. అనంతరం పశువుల యజమానులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. విచారిస్తున్నట్లు ఎస్ఐ లక్ష్మీనారాయణ వెల్లడించారు.

ఎద్దుల బలప్రదర్శన

మిడుతూరు, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని రోళ్లపాడులో కొలువైన బరక సంజీవరాయ స్వామి వార్షికోత్సవం సందర్భంగా ఎద్దుల బలప్రదర్శన రాష్ట్ర స్థాయి పోటీలు ఉత్సాహంగా సాగుతున్నాయి. శుక్రవారం న్యూ కేటగిరీ విభాగంలో 12 జతల ఎద్దులు పాల్గొన్నారు. ఈ పోటీలను తిలకించేందుకు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు భారీగా తరలివచ్చారు. అనంతరం గెలుపొందిన ఎద్దుల యజమానులకు కమిటీ నిర్వాహకులు నగదు ప్రోత్సాహకాలను అందజేశారు.



బండ లాగుతున్న ఎద్దులు

చెట్నహళ్లిలో 82 మందిపై కేసు నమోదు

• విచారణ చేపట్టిన డీఎస్పీ ఉపేంద్రబాబు



శ్మశానాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ ఉపేంద్రబాబు, ఎస్ఐ శివాంజల్

మంత్రాలయం, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చెట్నహళ్లి గ్రామ శ్మశాన స్థల వివాదం కేసులో 82 మందిపై పోలీసులు కేసు నమోదు చేశారు. మూడు రోజులుగా ఎస్సీ, బీసీల మధ్య శ్మశాన స్థలం విషయమై వివాదం నడుస్తోంది. ఈ క్రమంలోనే బీసీ వర్గాలకు చెందిన 50 మందిపై మంత్రాలయం ఎస్ఐ శివాంజల్ ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశారు. బీసీ వర్గాల వారు కూడా ఫిర్యాదు చేయడంతో ఎస్సీ వర్గానికి చెందిన 32 మందిపై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ శివాంజల్ తెలిపారు. డీఎస్పీ ఉపేంద్రబాబు చెట్నహళ్లిలో శుక్రవారం ఇరువర్గాలను విచారించారు.

కార్మికుల ప్రయోజనాలు కాపాడుతాం

• మార్కెటింగ్ శాఖ జేడీ రామాంజనేయులు



హమాలీలకు దుస్తులు పంపిణీ చేస్తున్న మార్కెటింగ్ జేడీ

కర్నూలు అగ్రికల్చర్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): కార్మికులకు ప్రయోజనాలు కల్పించేందుకు కట్టుబడి ఉన్నామని మార్కెటింగ్ శాఖ జాయింట్ డైరెక్టర్ రామాంజనేయులు హామీ ఇచ్చారు. శుక్రవారం కర్నూలు మార్కెట్ కమిటీ యార్డులో పని చేస్తున్న హమాలీలకు యూనిఫాం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కార్మికులు తమ సమస్యలను ఏకరువు పెట్టారు. ప్రభుత్వపరంగా అందాల్సిన ప్రయోజనాలను అందించేందుకు చర్యలు తీసుకోవాలని సెలక్షన్ గ్రేడ్ సెక్రటరీ జయలక్ష్మిని జేడీ ఆదేశించారు. సమావేశంలో అసిస్టెంట్ సెక్రటరీ వెంకటేశ్వర్లు, సూపర్‌వైజర్లు కేశవరెడ్డి, శివన్న, నాగేష్, అకౌంటెంట్ కిషన్‌రెడ్డి పాల్గొన్నారు.

కుమారుడి బాధ చూడలేక..


• ఉరివేసుకుని తల్లి ఆత్మహత్య

ఆత్మకూరు, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): ఇచ్చిన అప్పులు తిరిగి రాక.. చేసిన అప్పులు చెల్లించలేక కుమారుడు పడుతున్న బాధను చూసి భరించలేని ఓ తల్లి బలవన్మరణానికి పాల్పడిన ఘటన శుక్రవారం ఆత్మకూరు మండలంలోని నల్లకాల్వ గ్రామంలో జరిగింది. వివరాలివీ.. నల్లకాల్వ గ్రామానికి చెందిన గుండం రాజారెడ్డి, సుమిత్ర (60) దంపతుల కుమారుడైన నవీన్ కొన్నేళ్లుగా ఫైనాన్స్, చీటిలు వేస్తూ ఉపాధి పొందేవాడు. అయితే కొంత మంది ఆయన వద్ద అప్పులు తీసుకొని తిరిగి చెల్లించకపోగా, మరికొందరు చీటీలను ఎత్తి తదుపరి కంతులను ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేశారు. ఈ లెక్కన సుమారు రూ.2 కోట్ల వరకు ఇచ్చిన అప్పులు రావాల్సి ఉందని తెలిసింది. ఈక్రమంలోనే ఆయన కొంతమేర అప్పులు చేసి మరీ తాను ఇవ్వాల్సిన వారికి డబ్బులు కడుతూ వస్తున్నాడు. అదేవిధంగా తనకు అప్పులు ఇచ్చిన వారు మాత్రం తిరిగి చెల్లించాలని ఒత్తిళ్లకు గురిచేస్తూ వచ్చారు. అయితే తనకు ఇవ్వాల్సిన వారు మాత్రం ఇవ్వకుండా కాలయాపన చేస్తూ వచ్చారు. దీంతో చివరకు నవీన్ తల్లి సుమిత్ర స్వయంగా తన కుమారుడు ఇచ్చిన అప్పుదారుల ఇళ్ల వద్దకు వెళ్లి తమ పరిస్థితిని వివరించినా వారు జాప్యం చేస్తూ వచ్చారు. వీరిలో చాలామందికి తీసుకున్న అప్పులు చెల్లించే స్థోమత, ఆస్తులు ఉన్నప్పటికీ ఇవ్వకుండా అతన్ని వేధిస్తూ వచ్చారు. అలాగే అతనికి అప్పులు ఇచ్చిన వారు ఇళ్ల వద్దకు వెళ్తుండగా వాళ్లందరికీ ఆ తల్లి కచ్చితంగా చెల్లిస్తామని ఎంతో మర్యాదపూర్వకంగా చెప్పేవారు. చివరకు ఇచ్చిన అప్పులు తిరిగి రాక.. చేసిన అప్పులు చెల్లించలేక తన కుమారుడు పడుతున్న మానసిక క్షోభను చూసి భరించలేని ఆ తల్లి ఆత్మహత్య చేసుకోవాలని భావించింది. శుక్రవారం తన భర్త రాజారెడ్డి మార్నింగ్ వాక్‌కు వెళ్లిన సమయంలో ఇంట్లోనే ఉరివేసుకున్నారు. అంతకుముందు తెల్లవారుఝామునే ఆమె ఇంటిని శుభ్రపరిచి, పూజలు చేసి ఈ ఘాతుకానికి పాల్పడింది. నాలుగు పేజీల సూసైడ్ లెటర్‌ను రాసి అందులో తన ఆవేదనను వ్యక్తం చేసినట్లు తెలిసింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఆత్మకూరు అర్బన్ సీఐ డి.రాము వెల్లడించారు.

ఆర్టీసీ బస్సులో వ్యక్తి మృతి

కొలిమిగుండ్ల, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సులో ప్రయాణం చేస్తున్న ఓ వ్యక్తి శుక్రవారం రాత్రి మృతి చెందాడు. కడప జిల్లా మైలవరం మండలం వేపరాల గ్రామానికి చెందిన నాగయ్య(42) తాడిపత్రిలో బస్సు ఎక్కి జమ్మలమడుగు టికెట్ తీసుకున్నాడు. అప్పటికే మద్యం మత్తులో ఉన్న ఆయన బస్సు కొలిమిగుండ్ల దగ్గరికి రాగానే సీటు నుంచి కుప్పకూలి పడి పోయాడు. దీంతో డ్రైవర్ భయంతో బస్సును కొలిమిగుండ్ల పోలీస్ స్టేషన్ వద్దకు తీసుకెళ్లారు. వైద్యులు వచ్చి పరిశీలించగా అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. దీంతో పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు భద్రత నియమాలు పాటించాలి



మాట్లాడుతున్న ఆర్టీవో

కర్నూలు ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతా నియయాలను పాటించాలని ఆర్టీవో భరత్ చావాన్ సూచించారు. శుక్రవారం ప్రభుత్వ మైనార్టీ పాలిటెక్నిక్ కళాశాలలో 36వ జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాల కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆర్టీవో భరత్ చావాన్, ట్రాన్స్‌పోర్ట్ ఇన్‌స్పెక్టర్ కే.రవీంద్ర కుమార్, ఎంవీ సుధాకర్ రెడ్డి, అసిస్టెంట్ మోటారు వెహి కల్ ఇన్‌స్పెక్టర్ ఎస్‌గణేష్‌బాబు, ఆటో మొబైల్ హెచ్‌వోడీ ఈశ్వర్‌రెడ్డి, జనరల్ హెడ్‌వో శ్రీధర్‌లు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆర్టీవో భరత్ చావాన్ మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు హెల్మెట్, కారు డ్రైవింగ్ చేసే వారు సీటుబెల్టులు తప్పనిసరిగా ధరించాలన్నారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ చలపతి, హోంగార్డులు, అధ్యాప కులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మద్దతు ధర అందేదెప్పుడు ?

• వేరుశనగ, కంది రైతుల గగ్గోలు



మార్కెట్ యార్డుకు వచ్చిన వేరుశనగకాయలు

కర్నూలు అగ్రికల్చర్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధర తమకు అందేదెప్పుడు అని ఉమ్మడి కర్నూలు జిల్లా రైతులు గగ్గోలు పెడుతున్నారు. వేరుశనగకాయలకు ప్రభుత్వం క్వింటానికి రూ.6,723లను మద్దతు ధరగా ప్రకటించిందని, అయితే.. శుక్రవారం కర్నూలు మార్కెట్ యార్డులో గరిష్ఠ ధర రూ.6,088లు మాత్రమే పలికిందని, మధ్యస్థ ధర రూ.5,270లు, కనిష్ఠ ధర మరీ ఘోరంగా రూ.4,009లు మాత్రమే అందించడంపై రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. రేయింబవళ్లు కష్టపడితే కనీసం కూలీల డబ్బులు ఎల్లడం లేదని వాపోయారు. కంది రైతుల పరిస్థితి కూడా అదేవిధంగా ఉంది. ఒక పక్క మార్క్‌ఫెడ్ అధికారులు కందులు కొనుగోలుకు సంబంధించి క్వింటానికి రూ.7,550లు చెల్లిస్తుంటే.. కర్నూలు మార్కెట్ యార్డులో మాత్రం గరిష్ఠ ధర, మధ్యస్థ ధర రూ.7,149లు మాత్రమే వ్యాపారులు అందిస్తున్నారని, ఇదేమి ఘోరమని రైతులు ప్రశ్నించారు. శనగలకు గరిష్ఠ, మధ్యస్థ ధర రూ.5,689లు మాత్రమే అందిస్తున్నారనీ, కనిష్ఠ ధర కేవలం రూ.4,209లు మాత్రమే అందించారనీ రైతులు గగ్గోలు పెట్టారు. ఉల్లిగడ్డలకు గరిష్ఠ ధర రూ.2,311లు దక్కిందని, రెండు నెలల క్రితం రూ.4వేల నుంచి రూ.5వేలకు అమ్ముడుపోయిందని, ప్రస్తుతం అమ్మకానికి కేవలం 1,010క్వింటాళ్లు మాత్రమే వచ్చిందని, అలాంటప్పుడు ధర ఎందుకు పెరగలేదని ప్రశ్నించారు. కేవలం వ్యాపారులు సిండికేట్ కావడం వల్లనే ఈ పరిస్థితి దాపురించిందని రైతులు చెబుతున్నారు. ఎండుమిరపకాయలకు గత సంవత్సరం క్వింటానికి రూ.20వేల నుంచి రూ.30వేలు దక్కిందని, ప్రస్తుతం అందులో సగం కూడా అందడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. గరిష్ఠ ధర రూ.14వేలు, మధ్యస్థ ధర రూ.9,499లు, కనిష్ఠ ధర రూ.2,229లు మాత్రమే దక్కడం దారుణమని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

అనధికార లేఅవుట్లపై చర్యలు

కుడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు



ఆలూరు, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): అక్రమ లే ఔట్లపై ఉక్కుపాదం మోపుతామని కర్నూలు అర్బన్ డెవలప్ మెంట్ అథారిటీ చైర్మన్ (కుడా) సోమిశెట్టి వెంకటేశ్వరులు హెచ్చరించారు. శుక్రవారం ఆలూరు అతిథి హోటల్‌లో విలేకర్లతో మాట్లాడారు. ప్రభుత్వం ప్రజలకు సత్వర ప్రయోజనాలు అందించేదుకు ప్రభుత్వం స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ ప్రవేశ పెట్టిందన్నారు. మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ శాఖ ద్వారా సమూలమైన మార్పులు తీసుకువచ్చిందన్నారు. కుడా పరిధిలోని 896 గ్రామ పంచాయతీల పరిధిలో 300 చదరపు మీటర్ల విస్తీర్ణం వరకు స్థలంలో భవనం నిర్మాణ అనుమతులు ఆయా గ్రామ పంచాయతీ కార్యదర్శుల ద్వారా ఆన్‌లైన్ పొందవచ్చన్నారు. మంత్రాలయం నియోజకవర్గ కేంద్రంలో 115 మందికి నోటీసులు జారీ చేశామన్నారు. నోటీసులు తీసుకున్న 15 రోజుల లోపల మిగిలిన వారందరు అనుమతులు తీసుకోకపోతే కూల్చివేస్తామని హెచ్చరించారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 278 అక్రమ లేఅవుట్లను గుర్తించినట్లు తెలిపారు.

జగన్‌ను ప్రజలు నమ్మరు

కర్నూలు అర్బన్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): జగన్ రెడ్డి ప్రెస్‌మీట్ పెట్టి అసత్యాలు చెబితే ప్రజలు నమ్మేందుకు సిద్ధంగా లేరని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, కుడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు అన్నారు. శుక్రవారం జిల్లా పార్టీ కార్యాలయంలో మాట్లాడారు. నాలుగు సార్లు సీఎంగా పని చేసిన చంద్రబాబును ఏకవచనంతో సంబోధించిన తీరు బాగోలేదన్నారు. జగన్‌రెడ్డి సంస్కారం లేదని మండి పడ్డారు. ఒక ఆర్థిక ఉగ్రవాది ఆర్థిక వ్యవస్థ గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉందని విమర్శించారు. 31 క్రిమినల్ కేసుల్లో నిందితుడు, ప్రజలకు సమాధానం చెప్పుకోలేక పారిపోయిన వ్యక్తి విలువలు, విశ్వసనీయత, విధ్వం సాల గురించి మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందన్నారు. గాడి తప్పిన పాలన, ఆర్థిక వ్యవస్థను చంద్రబాబు గాడిలో పెడుతున్న తీరును జీర్ణించుకోలేక అవాకులు చవాకులు పేలుతున్నారని ధ్వజమెత్తారు.

ఎర్రచందనం, శ్రీగంధం చెట్లకు నిప్పు



కాలిపోయిన శ్రీగంధం, ఎర్రచందనం చెట్లు

క్రిష్ణగిరి, ఫిబ్రవరి 7: మండలంలోని చుంచు ఎర్రగుడి గ్రామంలో శుక్రవారం ఎర్రచందనం, శ్రీగంధం, మహాగని, టేకు చెట్లకు గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టారు. గ్రామానికి చెందిన రైతు బండారు మద్దిలేటి ఐదు ఎకరాల్లో ఏడేళ్ల కిందట చెట్లను నాటుకున్నాడు. గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో చెట్లు, డ్రిప్ పరికరాలు మొత్తం కాలిపోయాయి. ప్రభుత్వమే ఆదుకోవాలని రైతు మద్దిలేటి వాపోయాడు.

అక్రమ సొసైటీని రద్దు చేయాలి

స్టాంప్స్ రిజిస్ట్రార్ డీఐజీని కలిసిన ఏఐసీసీ సభ్యులు



రిజిస్ట్రేషన్ అధికారికి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

కర్నూలు అర్బన్, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): కళా వెంకట్రావు భవనం సొసైటీని రద్దు చేయాలని నంద్యాల జిల్లా డీసీసీ, ఏఐసీసీ సభ్యుడు జె. లక్ష్మి నరసింహ డిమాండ్ చేశారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ జిల్లా అధికారిని కలిసి ఓ వినతి పత్రం ఇచ్చారు. అనంతరం నగర అధ్యక్షులు జిలాని బాషా, మాజీ డీసీసీ కే బాబురావు, సీనియర్ నాయ కుడు అనంతరత్నం మాదిగలతో కలిసి మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని సొసైటీ పేరు మీదుగా మార్చుకున్న కర్నూలు జిల్లా అధ్యక్షుడు, సొసైటీలో ఉన్న సభ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీకి సంబంధించిన ఆస్తులపై ప్రతి కార్యకర్తకు హక్కు ఉందని, కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని సొసైటీ పేరు మీదుగా రిజిష్టర్ చేసుకోవడం దుర్మార్గమైన చర్య అని మండిపడ్డారు. తప్పుడు ఆలోచనలతో పార్టీ ఆస్తులను కాజేయాలని కుట్ర జరుగుతోందనే అనుమానం కలుగుతోంద న్నారు. బాలస్వామి, లాజరస్, డోన్ ఇన్‌చార్జి మద్దిలేటి, పఠాన్, అబీబ్ ఖాన్, రజాక్, విశ్వేశ్వరరెడ్డి, వెంకట్ నాయుడు పాల్గొన్నారు.

శ్రీకృష్ణ స్పీచ్ సెంటర్‌లో వైద్య శిబిరం

కొత్త టెక్నాలజీతో వినికిడి యంత్రాలు



వినికిడి పరీక్ష చేస్తున్న డాక్టర్ బి.శివకృష్ణ

కర్నూలు హాస్పిటల్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): కర్నూలు గౌరిగోపాల్ హాస్పిటల్ దగ్గర వుడ్ ల్యాండ్ కాంపౌండ్‌లో శ్రీకృష్ణ స్పీచ్ అండ్ హియరింగ్ సెంటరులో 19వ వార్షికోత్సవం సందర్భంగా సిగ్నియా కంపెనీ ఆధ్వర్యంలో శుక్రవారం చెవుడు, మాటలురాని వారికి ఉచిత వైద్యశిబిరాన్ని సెంటర్ అధినేత బి.శివకృష్ణ నిర్వహించారు. ప్రస్తుతం జర్మనీ టెక్నాలజీ కలిగిన సిగ్నియా కంపెనీ వినికిడి డిజిటల్ మినర్లు, కంపెనీ ఆడియాలజిస్టు ఎస్.సతీష్, కంపెనీ ఆర్ఎస్ఎం ప్రవీణ్ రెడ్డి, ఏఎస్ఎం మహేశ్వరరెడ్డి తరుపున బ్లూటూత్‌లు రీచార్జ్‌బుల్ హియరింగ్ ఎయిడ్‌పై 30 శాతం డిస్కౌంట్ లభిస్తుందన్నారు. దాదాపు 60 మందికి వినికిడి పరీక్షలు చేశామని, ఈ శిబిరం సోమవారం వరకు కొనసాగుతుందని, సద్వినియోగం చేసుకోవాలన్నారు. డాక్టర్ ఆర్.శ్రావంతి, డాక్టర్ కృష్ణచైతన్య, డాక్టర్ బి.శ్రావంతి, డాక్టర్ మాధురి, డాక్టర్ అనిల్ కుమార్ పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తు గుడిసె దగ్ధం



కాలిపోయిన గుడిసె వద్ద బాధితులు

కోసిగి, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): కోసిగిలోని 3వ వార్డు వాల్మీకి నగర్‌లో శుక్రవారం గుడిసె దగ్ధమైంది. కౌతాళం నాగరాజు, పార్వతి దంపతులు ఉదయం తమ గుడిసెకు తాళం వేసి కూలీ పనులకు వెళ్లారు. తమ ఇద్దరు పిల్లలు గీతాంజలి, అభిరాంలను బడులకు పంపించారు. అయితే మధ్యాహ్నం 2 గంటల సమయంలో తాళం వేసి ఉన్న గుడిసెలో ఒక్కసారిగా మంటలు వ్యాపించాయి. దీంతో సమీప కాలనీవాసులు, అంగన్‌వాడీ సెంటర్‌లోని ఆయా, టీచర్లు, పిల్లలు భయం భయంతో దూరంగా పరుగులు తీశారు. సమాచారం తెలుసుకున్న విద్యుత్ అధికారులు సంఘటనా స్థలానికి చేరుకొని కరెంట్‌ను నిలిపివేశారు. బీరువాలో ఉన్న రూ.70 వేల నగదు, 2 తులాల బంగారం, 20 తులాల వెండి కాళ్ల పట్టీలు, తిండి గింజలు, బట్టలు అగ్నికి కాలిపోయాయని బోరున విలపించారు. తమకు నిల్వ నీడ లేకుండాపోయిందని, ప్రభుత్వమే ఆదుకోవాలని కోరారు.

పొంచి ఉన్న ముప్పు

- శిథిలావస్థకు చేరుకున్న భవనాలు 135, ప్రమాదకరంగా ఉన్నవి 11
- వర్షాకాలంలో కూలే ప్రమాదం
- భవనాల యజమానులకు నోటీసులు ఇచ్చిన అధికారులు

కర్నూలు న్యూసిటీ, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): పాతబస్టాండులో అక్షయ హోటల్ పక్కన ఓ భవనం శిథిలావస్థకు చేరింది. గ్రౌండ్ ఫ్లోర్‌లో వ్యాపారాలు నిర్వహిస్తున్నారు. వినియోగదారులు వచ్చిన సమ యంలో భవనం కూలిందంటే ప్రాణ నష్టం జరిగే అవకాశం ఉందని స్థానికులు చెబుతున్నారు.

● మహాత్మానగర్‌లో 60 సంవత్సరాల భవనం శిథిలావస్థకు చేరిం ది. కింగ్ మార్కెట్ వెనుక ఉన్న ఇళ్లు ప్రమాదకర స్థితిలో ఉన్నట్లు గతంలోనే అధికారులు గుర్తించారు. పూలబజార్‌లోని రెండు ఇళ్లు శిథి లావస్థకు చేరాయి. గత సంవత్సరం నగరంలో ఎన్నడూ లేని విధంగా ఎడ తెరిపి లేకుండా వర్షాలు కురిశాయి. ఈ సంవత్సరం కూడా అదేవిధంగా వర్షాల కు కురిస్తే అనేక చోట్ల పాతమిద్దెలు కూలిపోతాయని అధికారులు నిర్ధారణకు వచ్చారు. కొన్ని ఘటనల్లో ఇంట్లోని వారు చనిపోయారు. అలాగే 2022 సంవత్సరంలో పాతబస్తీలో పండ్ల వ్యాపా రుల వద్ద కూలి పని చేసే వ్యక్తి మున్సిపాల్టీ పాతగోడ కూలి మృతి చెందాడు.. ఈ క్రమంలో నగరంలోని భవనాల పరిస్థితిపై అధికారులు అప్రమత్తం చేస్తున్నారు.

● **శిథిలావస్థకు చేరిన భవనాలకు నోటీసులు:** రెండేళ్ల క్రితం నగరంలో పట్టణ ప్రణాళికా విభాగం అధికారులు సచివాలయాల వారిగా ప్లానింగ్ కార్యదర్శులతో సర్వే చేయించారు. కర్నూలు, పాణ్యం, కోడ మూరు అర్బన్ ప్రాంతాల్లో 1.38 లక్షల ఇళ్ల అసెస్‌మెంట్లు ఉన్నాయి. జనాభా 5.50 లక్షలు ఉంది. ఇప్పటికే అన్ని ప్రాంతాలలో రెవెన్యూ, పట్టణ ప్రణాళికా విభాగం అధికారులు తనిఖీలు నిర్వహించాలి. రెవెన్యూ రికార్డుల ప్రకారం ఆ ఇళ్ల వయస్సు తేల్చాలి. ఇలాంటి ఇళ్లు ఎక్కువగా పాతబస్తీ, పాతకల్లూరు ప్రాంతాలలో ఉన్నాయి. ఇప్పటికీ మట్టి, గచ్చుతో నిర్మించిన ఇళ్లలో ప్రజలు నివసిస్తున్నారు. పూలబజార్, తెలుగు వీధి, చాకలి పేట, బుధవారపేట, చిదంబరావు వీధి, మండిబజార్, బండిమెట్ట, ఖడక్‌పురా వంటి అనేక కాలనీలలో అధికారులు సర్వే చేశారు. మొత్తం 135 ఇళ్లు శిథిలావస్థకు చేరుకున్నాయని, ఇందులో ప్రమాదకరంగా 11 భవనాలు ఉన్నట్లు గురించారు. అలాగే మట్టిమిద్దెలు పాతకల్లూరులో ఉన్నట్లు గుర్తించి వాటిలో నివాసం ఉంటున్న వారిని అప్రమత్తం చేసే దిశగా అప్పుడే చర్యలు చేపట్టారు. అయితే ఇందులో 13 ఇళ్లకు మరమ్మ తులు చేయించుకున్నారు. కొన్నింటిని కూల్చివేశారు. మరికొందరు ప్రత్యామ్నాయంగా నిర్మించుకున్నారు. ఈ క్రమంలో మిగిలిన ఇళ్లను కూడా అప్రమత్తం చేసే దిశగా అధికారులు నిర్ణయాలు తీసుకోవాలి. లేని పక్షంలో భవనాలు కూలి ఆస్తి, ప్రాణనష్టం జరిగే అవకాశం ఉందని మేధావులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.



పాతబస్టాండులో శిథిలావస్థకు చేరిన భవనం

మరోసారి సర్వే చేయిస్తాం



గతంలో ఒక్కసారి సర్వే చేయించాం. మరోసారి సర్వే చేయించి శిథిలావస్థ, ప్రమాదకరమైన భవ నాలను గుర్తించి అప్రమత్తం చేసే దిశగా చర్యలు తీసుకుంటాం. 70 ఏళ్ల క్రితం నిర్మించిన భవనాల్లో ఇప్పటికీ ప్రజలు నివసిస్తున్నట్లు అప్పట్లోనే గుర్తించాం. మరోసారి అలాంటి ఇళ్ల యజమానులకు నోటీసులు జారీ చేస్తాం. కొన్నింటికి మాత్రమే మార్పులు, చేర్పులు చేసుకున్నారు. మిగిలిన వాటిని కూడా చేసుకునే విధంగా ప్లానింగ్ సెక్రటరీలను ఆదేశిస్తాం.

– ప్రదీప్‌కుమార్, సిటీ ప్లానర్

వాహనాల పార్కింగ్ నియంత్రణకు చర్యలు


పార్కింగ్ చేసిన వాహనాలను పరిశీలిస్తున్న సూపరింటెండెంట్

కర్నూలు హాస్పిటల్, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో ఎక్కడ పడితే అక్కడ వాహనాలను పార్కింగ్ చేస్తున్నారని, వాటి నియంత్రణకు చర్యలు చేపట్టాలని ఆసుపత్రి సూపరిం టెండెంట్ కె.వెంకటేశ్వర్లు ఆదేశించారు. శుక్రవారం ఆయన సీఎస్ఆ ర్ఎంవో బి.వెంకటేశ్వరరావు, అడ్మినిస్ట్రేటర్ సింధు సుబ్రహ్మ ణ్యం తో కలిసి ఆస్పత్రిలో రౌండ్స్ నిర్వహించారు. గైనిక్ విభాగం దగ్గర ఉన్న వ్యర్థాలను తొలగించి పరిశుభ్రంగా ఉండేటట్లు చూసు కోవాలని పారిశుధ్య సిబ్బందిని ఆదేశించారు. ఆసుపత్రిలోని పెయింగ్ బ్లాక్ ఇతర వార్డులో వాటర్ లీకేజీ అవుతున్నాయని, వీటికి మరమ్మతులు పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. రోగులకు ఇస్తున్న భోజనాన్ని సూపరింటెండెంట్ పరిశీలించారు. కార్యక్రమంలో హాస్పిటల్ అడ్మినిస్ట్రే టర్స్ డా.కిరణ్ కుమార్, న్యూడ యోగ్నస్టిక్ బ్లాక్ మెడికల్ ఆఫీసర్ డా.సునీల్ ప్రశాంత్, ఆసుపత్రి ఏడీ మల్లేశ్వరి, నర్సింగ్ సూపరిం టెండెంట్ సావిత్రీబాయి పాల్గొన్నారు.

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

కల్లూరు, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): పాణ్యం నియోజకవర్గ ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా మాధవీనగర్‌లోని ఎమ్మెల్యే కార్యా లయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే గౌరుచరిత తెలిపారు. ప్రతి శనివారం పబ్లిక్ గ్రీవెన్స్ చేపట్టి ఎమ్మెల్యే ప్రజల నుంచి వినతులను స్వీకరించనున్నారు. ఉదయం 10 గంటల నుంచి ఎమ్మెల్యే కార్యాలయంలో ప్రజల నుంచి నేరుగా అర్జీలు స్వీకరించి సంబందింత శాఖ అధికారులతో చర్చించి సమస్యలకు పరిష్కారం చూపేలా చర్యలు తీసుకుంటారు.

వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ తనిఖీ

కర్నూలు క్రైం, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌ను ఎస్పీ విక్రాంత్ పాటిల్ శుక్రవారం రాత్రి తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. స్టేషన్ పరిధిలోని కేసులను ఆరా తీశారు. అసాంఘిక కార్యకలాపాలపై చర్యలు తీసుకోవాలని సీఐ రామాంజనాయుడును ఆయన ఆదేశించారు.

రేపు యాదవుల ఆత్మీయ సమావేశం

కర్నూలు అర్బన్, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): ఈనెల 9న నిర్వహించే యాదవుల ఆత్మీయ సమావేశాన్ని విజయవంతం చేయాలని టీడీపీ కర్నూలు నగర అధ్యక్షుడు పి. నాగరాజు యాదవ్ కోరారు. శుక్రవారం సాయంత్రం నగరంలోని సంఘ ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. యాదవులను కొన్ని పార్టీలు ఓటు బ్యాంక్ రాజకీయాలకు మాత్రమే ఉపయోగించుకుంటున్నాయన్నారు. టీడీపీతోనే యాదవుల అభివృద్ధి సాధ్యమన్నారు. జిల్లా పరిషత్ ఆవరణలో ఆదివారం ఏర్పాటు చేయనున్న ఆత్మీయ సమావేశానికి జిల్లా వ్యాప్తంగా ఉన్న యావులంతా తరలి రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో యాదవ సంఘం నాయకులు పాల్గొన్నారు.

గీతాంజలి నర్సింగ్ విద్యార్థుల స్కూల్ హెల్త్ ప్రోగ్రాం


రక్త పరీక్షలు నిర్వహిస్తున్న నర్సింగ్ కాలేజీ విద్యార్థినులు

కర్నూలు హాస్పిటల్, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): నగరంలోని గాయత్రీ ఎస్టేట్‌లో ఉన్న గీతాంజలి నర్సింగ్ కాలేజీ 3వ సంవత్సరం బీఎస్సీ నర్సింగ్ విద్యార్థులు శనివారం బీ.క్యాంపు జడ్పీ హెచ్‌ఎస్ విద్యార్థులకు స్కూల్ హెల్త్ ప్రోగ్రాం నిర్వహించారు. అందులో భాగంగా అక్కడి విద్యార్థులకు ఆరోగ్యభద్రతపై అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులకు బీపీ, షుగర్, థైరాయిడ్, రక్త పరీక్షలు నిర్వహించారు. స్కూల్ హెల్త్ పోగ్రాంలో భాగంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు కాలేజీ ప్రిన్సిపాల్ వసంత కుమారి తెలిపారు.

విజయమే లక్ష్యంగా పోరాడాలి


నెట్‌బాల్ క్రీడాకారులతో అతిథులు

కర్నూలు స్పోర్ట్స్, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): క్రీడ ఏదైనా విజయమే లక్ష్యంగా పోరాడాలని రిటైర్డ్ డీఎస్పీ మహబూబ్ బాషా అన్నారు. శుక్రవారం ఉమ్మడి జిల్లాలోని 18 ఏళ్లలోపు నెట్‌బాల్ క్రీడాకారుల ఎంపికలు స్థానిక సిల్వర్ జూబ్లీ కళాశాల క్రీడా మైదానంలో జరిగాయి. ఈ కార్యక్రమానికి హాజరైన రిటైర్డ్ డీఎస్పీ మహబూబ్ బాషా మాట్లాడుతూ క్రీడలతో మానసిక ఉల్లాసం కలుగుతుందన్నారు. కర్నూలు జిల్లా నెట్‌బాల్ సంఘం వ్యవస్థాపకుడు నాగరత్నమయ్య మాట్లాడుతూ ఈ నెల 15, 16 తేదీలల్లో తూర్పుగోదావరి జిల్లా రావులపాలెంలో జరిగే రాష్ట్ర స్థాయి నెట్ బాల్ చాంపియన్‌షిప్ పోటీల్లో జిల్లా క్రీడాకారులు పాల్గొని విజేత లుగా రావాలని కోరారు. ఈ ఎంపికలో మొదటి మూడు స్థానాలు సాధించిన టీములకు కప్‌లు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా నెట్‌బాల్ సంఘం అధ్యక్షుడు నాగేశ్వరబాబు, ప్రధాన కార్యదర్శి వంశీకృష్ణ, కోచ్‌లు చరణ్, గీతాంజలి, క్రీడాకారులు పాల్గొన్నారు.

రీసర్వేను పకడ్బందీగా నిర్వహించాలి


రైతులతో మాట్లాడుతున్న ఆర్డీవో

సి.బెళగల్, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన సి.బెళగల్‌లో చేపట్టిన రీసర్వేను పకడ్బందీగా నిర్వహించాలని కర్నూలు ఆర్డీవో సందీప్‌కుమార్ రెవెన్యూ అధికారులను ఆదేశించారు. శుక్రవారం మండల కేంద్రంలో చేపట్టిన రీసర్వేను ఆయన తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రీసర్వేను పకడ్బందీగా నిర్వహించాలని తహసీల్దార్ పురుషో త్తంకు ఆదేశించారు. మండలంలోని గొల్లలదొడ్డి గ్రామ రైతులు కృష్ణ, రామకృష్ణ, రమేష్ అనుభవంలో ఉన్న సర్వే నెంబర్లలో తేడాలు ఉన్నాయని నెల రోజుల క్రితం ఆర్డీవో ఫిర్యాదు చేశారు. ఈమేరకు ఆయన రైతుల పొలాలను పరిశీలించారు. ఆర్డీవో వెంట రీసర్వే డిప్యూటీ తహసీల్దార్ వెంకటేశ్వర్లు, సర్వేయర్ నాగభూషణం, వీఆర్వోలు, రైతులు ఉన్నారు.

రైతు బజారును ప్రారంభించండి


జేడీకి వినతి పత్రం ఇస్తున్న సీపీఎం నాయకులు

కర్నూలు అగ్రికల్చర్, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): నగరంలో 32వ వార్డు పరిధిలో ఉన్న గోవర్ధన్‌నగర్‌లో రైతుబజారును ప్రారం భించాలని సీపీఎం ప్రతినిధి బృందం మార్కెటింగ్ శాఖ జేడీ రామాం జనేయులుకు శుక్రవారం వినతి పత్రం అందించింది. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి రాముడు, సాయిబాబా, సుధాకరప్ప మాట్లా డుతూ గోవర్ధన్ నగర్‌లో రైతుబజారు పూర్తయి 8 నెలలు కావస్తున్నా ప్రారంభించకపోవడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. రైతుబజారు ప్రాంగణంలో రాత్రి పూట అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నాయని వారు జేడీ దృష్టి తెచ్చారు. రైతుబజారును వెంటనే ప్రారంభించేందుకు చర్యలు తీసు కుంటామని జేసీ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు ఆనంద్, రామకృష్ణ ఉన్నారు.

రజక వెల్ఫేర్ కమిటీని ఏర్పాటు చేయాలి


మంత్రికి వినతిపత్రం ఇస్తున్న సావిత్రి తదితరులు

కర్నూలు కలెక్టరేట్, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): జిల్లాలో జీవో నెంబర్ 6 ప్రకారం రజక వెల్ఫేర్ కమిటీని ఏర్పాటు చేయాలని ఏపీ రజక వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ సావిత్రి శుక్రవారం విజయవాడలో రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవితకు వినతి పత్రాన్ని అందజేశారు. అదేవిధంగా ఆస్పత్రులు, పోలీసు శాఖలలో పెండింగ్‌లో ఉన్న దోబీ పోస్టులను భర్తీ చేయాలని కోరారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

ఓర్వకల్లు, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని చెన్నంచెట్టిపల్లె గ్రామానికి చెందిన మద్దిరాళ్ల రామస్వామి (48) కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్ఐ సునీల్‌కుమార్ శుక్రవారం తెలిపారు. ఈ నెల 4న సోమయాజుల పల్లె బస్‌స్టేజీ వద్ద రోడ్డు దాటుతుండగా. గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో తలకు తీవ్రగాయాలయ్యాయి. కర్నూలు ప్రభుత్వ ఆసు పత్రిలో చికిత్స పొందుతూమృతి చెందాడు. మృతుడి భార్య మహే శ్వరి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు.

విద్యార్థినులకు సైకిళ్ల పంపిణీ

కర్నూలు ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రీజినల్ బిజినెస్ ఆఫీస్ సౌజన్యంతో కట్టమంచి రామలింగారెడ్డి స్మారక నగరపాలక ఉన్నత పాఠశాల ఎస్‌ఏపీ క్యాంపులోని 8, 9, 10 తరగతులు చదివే విద్యార్థినులకు సీఎస్ఆర్ పథకం కింద సైకిళ్ల పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఎస్‌బీఐ చీఫ్ మేనేజర్ పి.పద్మనాభ రావు, ఆర్‌బీవో హెచ్‌ఆర్ ఎంఎస్ సురేష్‌లు మాట్లాడుతూ విద్యార్థులు చదవులో రాణించాలన్నారు. కార్యక్ర మంలో ప్రధానోపాధ్యాయులు వెంకటరెడ్డి, కమిటీ చైర్మన్ డి.కుమా ర్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కల్లూరు, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): నెలవారి విద్యుత్ మరమ్మతు పనుల్లో భాగంగా నగరంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉం టుందని కర్నూలు టౌన్ డివిజన్ ఈఈ టి.శేషాద్రి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రెండో శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు నగరంలోని అన్ని ప్రాంతాల్లో కరెంట్ కోత ఉంటుందన్నారు. ఈ అసౌకర్యాన్ని ప్రజలు గుర్తించి విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బందికి సహకరించాలని కోరారు.

సి.బెళగల్: విద్యుత్ మరమ్మతు పనుల్లో భాగంగా కోడుమూరు, గూడూరు, సిబెళగల్ మండలలాలో రెండో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏడీ జేసస్ తెలిపారు. శుక్రవారం సి.బెళగల్ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ ఉదయం 9 గంటల నుంచి ఈసమావేశంలో గూడూరు, సి.బెళగల్ విద్యుత్ ఏఈలు సుకుమార్, నాగన్న, లైన్‌మెన్లు పాల్గొన్నారు.

కేవీఆర్ డిగ్రీ కళాశాలలో వైద్య శిబిరం

కర్నూలు అర్బన్, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): కేవీఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఓమ్ని, ఒక్ డెంటల్ ఆస్పత్రుల సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. విద్యార్థినులకు రక్త గ్రూపు, హిమోగ్లోబిన్ పరీక్షలు చేశారు. వైద్యులు శిశిర, స్రవంతి, అరతి చక్రా, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

10న నులి పురుగుల నివారణ దినం

సి.బెళగల్, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): నులిపురుగుల నివారణ దినాన్ని విజయవంతం చేయాలని మండల వైద్యాధికారి మిథు న్‌కుమార్ రెడ్డి అన్నారు. శుక్రవారం మండల వెలుగు కార్యా లయంలో హెల్త్ సూపర్‌వేజర్ విజయకుమార్ అధ్యక్షతన ఆశా వర్కర్లు, ఏఎన్ఎంలు, అంగన్‌వాడీ కార్యకర్తలతో సమావేశం నిర్వ హించారు. ఈసంద ర్భంగా వైద్యాధికారి మిథున్‌కుమార్ రెడ్డి మాట్లాడుతూ ఈనెల 10న జాతీయ నులిపురుగుల నివారణ దినం సందర్భంగా మండలం లోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు మాత్రలు వేయాలన్నారు. ఈసమావేశంలో ఎంపీడీవో రాణెమ్మ, ఈవో ఆర్డీ ఈశ్వరస్వామి వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ప్రమాదాల బారిన పడినా పట్టించుకోరా..?

పౌర సంక్షేమ సంఘం పట్టణ నాయకుడు పుల్లారెడ్డి


రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగు నీటిని పరిశీలిస్తున్న పుల్లారెడ్డి

కర్నూలు న్యూసిటీ, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): పంప్‌హౌస్‌లో తాగునీటి శుద్ధ కేంద్రాలు శుభ్రం చేసినప్పుడు, వర్షం వచ్చినప్పుడు నీళ్లంతా వెంకటరమణ కాలనీ మెయిన్ రోడ్డుపై నిలిచిపోవడంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలుగుతుందని, రోడ్డుపై వెళ్లే ద్విచక్ర వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నా పట్టించుకోరా పౌర సంక్షేమ సంఘం పట్టణ నాయకుడు ఇరిగినేని పుల్లారెడ్డి ప్రశ్నించారు. శుక్రవారం స్థానిక పంప్‌హౌస్ వెంకటరమణ కాలనీ ఫుట్‌పాత్ రోడ్డుపై పారుతున్న మురుగునీరును పరిశీలించారు. అక్కడి సమస్యలను స్థానికులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక పంప్‌హౌస్‌లో జనాలు వ్యతిరేకించినప్పటికీ నగర పాలక సంస్థ పాలకవర్గం, అధికారులు వ్యాపార సముదాయాలు నిర్మించారన్నారు. షాపుల ఎదుట ప్రహరీ నిర్మించి దాని పక్కనే ఉన్న మురుగు కాల్వలో టన్నుల కొద్ది మట్టి వదిలేశారన్నారు. మట్టికుప్పల ఫొటోలు తీసి కమిషనర్‌కు చూపించి ఆరు నెలలైనా స్పందించడం లేదన్నారు. వెంటనే కమిషనర్ జోక్యం చేసుకుని మురుగు కాలువల్లో వేసిన మట్టిని తొలగించేలా కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

కోనేర్లలో నీరు తొలగింపు


కోనేరులో యంత్ర సాయంతో నీటిని తొలగిస్తున్న సిబ్బంది

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

ఓర్వకల్లు, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): కాల్వబుగ్గ రామేశ్వరస్వామి ఆలయంలో 'ఎండిపోయిన కోనేర్లు' అనే కథనం శుక్రవారం ప్రచురితమైంది. అందుకు స్పందించి ఆలయ ఈవో మద్దిలేటి, ఉత్సవ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో రెండు కోనేర్లలో నీటిని యంత్రం ద్వారా తొలగించారు. అలాగే వాగు వెంట ఉన్న పాచీని తొలగించారు.

పోస్టర్ విడుదల


పోస్టర్‌ను విడుదల చేస్తున్న అధికారులు

కోడుమూరు, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం హెల్త్ సిబ్బంది ఆధ్వర్యంలో జాతీయ నులిపురుగుల నిర్మూలనకు సంబంధించిన పోస్టర్‌ను శుక్రవారం ఎంపీడీవో రాముడు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 10న జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవాన్ని విజయవంతం చేయాల న్నారు. కార్యక్రమలో ఎంఈవో వసంత లక్ష్మీ, హెల్త్ సిబ్బంది నరసప్ప, కమాల్‌సాహెబ్ పాల్గొన్నారు.

27న అంతర్రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలు

ఓర్వకల్లు, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి సందర్భంగా ఈనెల 27న అంతర్రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకుడు షేక్షావలి శుక్రవారం తెలిపారు. ఈ పోటీల్లో పాల్గొనే టీం సభ్యులు ప్రవేశ రుసుం రూ.500 చెల్లించాలన్నారు. విజేతలకు మొదటి నుంచి ఆరు బహుమతులు వరుసగా రూ.40వేలు, రూ.30 వేలు, రూ.20వేలు, రూ.10వేలు, రూ.5వేలు, రూ.3వేలు నగదును అందజేస్తున్నామని తెలిపారు. వివరాలకు 9014659220, 8302872 257 నెంబర్లను సంప్రదించాలని సూచించారు.

మార్చి 1న పాలపండ్ల బండలాగుడు పోటీలు: మహాశివరాత్రి ఉత్సవాల సందర్భంగా మార్చి 1న పాలపండ్ల బండలాగుడు పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు శుక్రవారం తెలిపారు. ఈ పోటీల్లో పాల్గొనే ఎద్దుల యజమానులు ప్రవేశ రుసుం రూ.800 చెల్లించాలన్నారు. విజేతలకు నగదు బహుమతులు అందజేస్తామ న్నారు. వివరాలకు 7889464141, 8309165221 నెంబర్లను సంప్ర దించాలని సూచించారు

అంబేడ్కర్ విజయం వెనుక రమాబాయి కృషి


రమాబాయి చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న మహిళలు

కర్నూలు అర్బన్, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): బాబాసాహెబ్ అంబేడ్కర్ విజయం వెనుక రమాబాయి కృషి ఉందని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ మహిళా ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షురాలు నంది విజయలక్ష్మి అన్నారు. శుక్రవారం నగరంలోని ఆ సంఘం కార్యాలయంలో రమాబాయ్ అంబేడ్కర్ 127వ జయంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో ఈరమ్మ, కటికే భాను పద్మావతి, లక్ష్మేశ్వరి, రంగమ్మ పాల్గొన్నారు.

అవయవ దాతకు అశ్రు నివాళి


కొవ్వొత్తులతో నివాళి అర్పిస్తున్న సభ్యులు

కర్నూలు హాస్పిటల్, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): అవయవ దాత పావని లత మరణించినప్పటికి ఆరుగురికి తన అవయవా లను దానం చేసి ప్రాణం పోసిందని జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షుడు బర్మా సురేష్ కుమార్ కొనియాడారు. అవయవదానం చేసి ఏడాది పూర్తయిన సందర్భంగా పావని లతకు శుక్రవారం రాత్రి కలెక్టరేట్ ఎదుట మానవత, జేవీవీ, రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో ఆమెకు నివాళులర్పిస్తూ కొవ్వొతుల ప్రదర్శన నిర్వహించారు. అవయవదానం చేసిన దాతల కుటుంబానికి ప్రభుత్వం రూ.10 లక్షలు ప్రకటించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మానవతా జిల్లా కన్వీనర్ మనోహర్ రెడ్డి, పాటిల్ హనుమంతరెడద్ది, మహిళా విభాగం నాయకులు అపర్ణ, దీప, లక్ష్మి, సాంబ, సరోజ, లెక్చరర్ సుంకన్న, అరుణ పాల్గొన్నారు.

ఫుట్‌బాల్ లీగ్ పోటీలు ప్రారంభం

కర్నూలు స్పోర్ట్స్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): స్థానిక డీఎస్ఏ ఔట్‌డోర్ స్టేడియంలో ఫుట్‌బాల్ లీగ్ పోటీలు ప్రారంభమ య్యాయి. ఈ పోటీలను జిల్లా ఫుట్‌బాల్ సంఘం అధ్యక్షుడు ముప్పా రాజశేఖర్ ప్రారంభించారు. బీ.క్యాంపు జట్టు, నంద్యాల జట్టుపై 7-2 గోల్స్‌తో గెలిచింది. పోటీలు రౌండ్‌రాబిన్ లీగ్ పద్ధతి లో నిర్వహిస్తున్నారు. ఫుట్‌బాల్ సంఘం కార్యదర్శి శ్రీనివాసులు, కుమార్ నారాయణ, బ్రహ్మకుమార్, మహబూబ్ బాషా, జగదీష్, మహేష్ పాల్గొన్నారు.

ఆలపాటిని కలిసిన హనుమంతరావు చౌదరి

కర్నూలు అర్బన్, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థి, మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్ర ప్రసాద్‌ను గుంటూరులో జిల్లా సాంస్కృతిక విభాగం అధ్యక్షులు హనుమంతరావు చౌదరి శుక్రవారం కలిశారు. కూటమి అభ్యర్థిగా పోటీలో ఉన్న ఆలపానిని గెలిపించాలని కోరారు. ఆర్గనైజింగ్ సెక్రటరీ లక్ష్మి పద్మా చౌదరితో కలిసి ప్రచారం చేస్తామన్నారు.

దివ్యాంగుల ర్యాలీ

కర్నూలు కలెక్టరేట్, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): సాంఘిక సామాజిక న్యాయశాఖ న్యూఢిల్లీ ఆదేశాల మేరకు కలెక్టరేట్ ప్రాంగణంలో శుక్రవారం జిల్లా విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సుగమ్యా యాత్ర దివ్యాంగుల ర్యాలీ నిర్వహిం చారు. ముఖ్యఅతిథిగా జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి ఎస్.పర్వీన్ హాజరై మాట్లాడుతూ ర్యాంపులు, బ్రెయిలీ సిగ్నల్స్, సైన్ బోర్డుల గురించి దివ్యాంగులకు అవగాహన కల్పించామన్నారు. జిల్లా విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ అధికారి రాయిస్ ఫాతిమా, రామాంజనేయులు, గోపాల్, ఉపేంద్ర, సాల్మన్‌రాజు, విజయ పాల్గొన్నారు.

పారిశుధ్య పనుల పరిశీలన

కర్నూలు న్యూసిటీ, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): నగరంలోని వెంకటరమణ కాలనీ, అశోక్‌నగర్, ఇందిరాగాంధి నగర్, రైల్వేస్టేషన్ ప్రాంతాలలో పారిశుధ్య పనులను శుక్రవారం నగర పాలక కమిషనర్ రవీంద్రబాబు తనిఖీ చేశారు. సిబ్బంది తప్పనిసరిగా సమయపాలన పాటించాలని, ఫిర్యాదులు పునరావృతం కాకుండా చూడాలన్నారు.

కౌలు రైతు కుటుంబాన్ని ఆదుకోవాలి

గూడూరు, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): గూడూరులో అప్పుల బాధ తాళలేక ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న కౌలు రైతు ఉప్పరి నాగరాజు కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జగన్నాథం అన్నారు. శుక్రవారం గూడూరు పట్టణంలో నాగరాజు కుటుంబాన్ని ఆయన పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాధిత కుటుంబానికి ప్రభు త్వమే ఇల్లు నిర్మించాలని, రూ.15లక్షల ఆర్థిక సాయంతోపాటు కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇప్పించాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట రైతు సంఘం జిల్లా కార్యదర్శి పంపన్నగౌడు, కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి తిమ్మయ్య, సీపీఐ నాయకులు శ్రీనివాసులు, రాజు ఉన్నారు.


బాధితులతో మాట్లాడుతున్న జగన్నాథం

ఉపయోగపడని ల్యాబ్

- ఆలూరులో నామమాత్రంగా అగ్రిల్యాబ్ సేవలు
- అందుబాటులో ఉండని సిబ్బంది
- రైతులకు అవగాహన కల్పించడంలో నిర్లక్ష్యం


ఆలూరు పట్టణంలోని అగ్రిల్యాబ్

ఆలూరు, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): రైతులకు మెగైన సేవలందించేందుకు గత వైసీపీ ప్రభుత్వం అగ్రిల్యాబ్‌ను ఏర్పాటు చేసింది. అయితే దీని నిర్వహ ణలో ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేకపో వడంతో సిబ్బంది ఇష్టరాజ్యంగా వ్యవహ రిస్తున్నారని అందుబాటులో ఉండటం లేదని ఆరోపణలు ఉన్నాయి.

గత వైసీపీ హయాంలో ప్రారంభం

ఆగ్రిల్యాబ్‌ల ద్వారా భూసార పరీక్షలు, పశు సంవర్ధక శాఖ పరీక్షలకు, ఆక్వా కల్చర్ అబివృద్ధిలో భాగంగా టెస్టింగ్ ల్యాబ్‌లను గత ప్రభుత్వంలో ఆలూరులో మంత్రిగా ఉన్న గుమ్మనూరు జయరాం ఎన్నికల ముందు హడావుడిగా మార్కెట్ యార్డులో రూ.1.50 కోట్లతో నిర్మించిన అగ్రికల్చర్ టెస్టింగ్ ల్యాబ్‌ను ప్రారంభించారు. ఆచరణలో మాత్రం లక్ష్యాన్ని అధిగమించలేదు.

సర్దుబాటులో ద్వారా సిబ్బంది

అగ్రి ల్యాబ్‌కు సిబ్బందిని నియమించకుండా వ్యవసాయ శాఖలోని వారినే ఇక్కడికి సర్దుబాటు చేశారు. అలాగే ల్యాబ్‌కు అటెండర్, వాచ్‌మెన్ కూడా లేడు. దీంతో ల్యాబ్ భద్రత ప్రశ్నార్థకంగా మారింది.

సిబ్బంది ఇష్టారాజ్యం

ల్యాబ్‌లో పనిచేసే సిబ్బందికి బయోమెట్రిక్ కానీ, ఫేస్ రికగ్నిషన్ అటెండెన్స్ కానీ లేవు. దీంతో సిబ్బంది ఆడిందే ఆట పాడిందే పాటగా మారింది. దీంతో సేవల కోసం వచ్చిన రైతులకు నిరాశే ఎదురవుతోంది. సమావేశాలు ఉన్నాయం టూ పత్తా లేకుండా పోతున్నారని రైతులు ఆరోపిస్తున్నారు.

● ఈ విషయంపై ల్యాబ్ ఇన్‌చార్జి దేవభూషణ్‌ను వివరణ కోరగా రైతులకు సలహాలు ఇస్తున్నామని, విత్తనాల నాణ్యత విషయంలో కూడా ఇక్కడే పరీక్షలు చేస్తున్నామని సమాధానం ఇచ్చారు.

అందించాల్సిన సేవలు..

అగ్రి ల్యాబ్‌లో భూసార పరీక్షలు, పంటల సాగులో రైతులకు అవసరమైన సలహాలు సూచనాలు ఇవ్వాలి. ఇవన్నీ ప్రభుత్వం ఉచితంగా కల్పించే సేవలు. రైతులు నేరుగా గాని, వ్యవసాధికారుల ద్వారా గాని భూసార పరక్షలు చేయించుకోవచ్చు. అలాగే విత్తనాల నాణ్యతను కూడా తెలుసుకోవచ్చు.

నామమాత్రపు సేవలు..

ఆలూరు పట్టణంలో అగ్రి ల్యాబ్ అంటూ ఒకటి ఉందని కూడా రైతులకు తెలియదు. రైతులకు అందించే సేవలపై గ్రామాల్లో అధికారులు కనీసం అవగాహన కూడా కల్పించడం లేదని సమాచారం. అగ్రిల్యాబ్ నామమాత్రంగా మిగిలిపోయింది.

రైతులకు అందుబాటులోకి తేవాలి



రూ.కోట్లు వెచ్చింది నిర్మించిన అగ్రి ల్యాబ్‌ను రైతులకు అందుబాటులోకి తేవాలి. ఇక్కడి సేవల గుఇరంచి కరపత్రాల ద్వారా గ్రామాల్లో ప్రచారం చేస్తేనే ఉపయోగం. సిబ్బంది ఆ దిశగా ప్రయత్నాలు చేయాలి.

- నారాయణ రెడ్డి, తెలుగు రైతు నాయకుడు, ఆలూరు

మద్యం దుకాణాల దరఖాస్తుకు నేడు ఆఖరు

ఆదోని, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): కల్లుగీత కార్మికులు మద్యం దుకాణాల కోసం దరఖాస్తు చేసేందుకు శనివారం చివరి రోజుని ఆదోని ఎక్సైజ్ సీఐ సైదుల్ పేర్కొన్నారు. ఫిబ్రవరి 8 తేదీ సాయంత్రం 5 గంటల వరకు మాత్రమే అవకాశం ఉందన్నారు. ఫిబ్రవరి 10న కలెక్టరేట్‌లో కలెక్టర్ సమక్షంలో లాటరీ తీస్తామన్నారు. ఆదోని టౌన్‌తో పాటు రూరల్‌లో 3 షాపులు, ఆలూరు నియోజకవర్గంలో 2 షాపులు, కర్నూలు 1, ఎమ్మిగనూరు,1, క్రిష్ణగిరి 1, మద్దికెర 1, కోసిగి 1 షాపులకుగాను శుక్రవారం వరకు 53 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. జిల్లాకు చెందిన వారు మాత్రమే దరఖాస్తు చేయాలని, రూ.2 లక్షల నాన్ రీఫండబుల్ ఫీజు చెల్లించాలన్నారు. కల్లుగీత కార్మికులకు మద్యం షాపుల లైసెన్స్ ఫీజులో 50 శాతం రాయితీని ప్రభుత్వం ఇచ్చిందని వివరించారు.

రీ సర్వే పకడ్బందీగా చేయాలి

- ఆర్డీవో భరత్‌కుమార్ నాయక్

తుగ్గలి, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): రీ సర్వేను పకడ్బందీగా చేయాలని ఆర్డీవో భరత్ కుమార్ నాయక్ అన్నారు. శుక్రవారం తహసీల్దార్ కార్యాలయంలో సిబ్బందితో మాట్లాడారు. రీసర్వేను రైతుల సహకారంతో చేయాలని వారు సహకరిస్తేనే అవకతవకలు లేకుండా ఉంటుందన్నారు. అనంతరం మండలంలోని సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తహసీల్దార్ రమాదేవి, డీటీ నాగరాజు, సర్వేయర్ సుధాకర్, వీఆర్వోలు నాగేంద్ర, కాశీ రంగస్వామి, వెంకట్రాముడు, రెహమాన్ ఉన్నారు.

వెల్దుర్తి టౌన్: చివాలయ సిబ్బంది సర్వేలను పకడ్బందీగా చేచాలని ఎంపీడీవో సుహాసినమ్మ సూచించారు. శుక్రవారం ఎంపీడీవో కార్యాలయంలో మాట్లాడుతూ నేడు రెండో శనివారం అయినా పని చేయాలన్నారు. వచ్చే బుధవారం లోపు లాగిన్లలో సర్వే మొత్తం జీరో కావాలన్నారు. లేనిపక్షంలో జీఎస్‌డబ్ల్యూఎస్ సెక్రటరీ ఆదేశాల మేరకు వారిపై చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని హెచ్చరించారు.

వైద్యశిబిరాన్ని వినియోగించుకోండి

మద్దికెర, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 10న గ్రామంలోని సుబ్రహ్మణ్యస్వామి ఆలయ ప్రాంగణంలో ఇర్రవహించే ఉచిత వైద్య శిబిరాన్ని వినియోగించుకోవాలని ఎమ్మెల్యే శ్యాంబాబు సూచించారు. శుక్రవారం ఎమ్మెల్యే కరపత్రాలను విడుదల చేశారు. రోగులకు భోజనాన్ని కూడా ఏర్పాటు చేశామన్నారు.

నులిపురుగుల నివారణకు కృషి చేయండి


పోస్టర్లను విడుదల చేస్తున్న ఎంపీడీవో సుహాసినమ్మ

వెల్దుర్తి టౌన్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): నులి పురుగుల నివారణకు కృషి చేయాలని ఎంపీడీవో సుహాసినమ్మ పేర్కొన్నారు. శుక్రవారం కార్యాలయంలో జాతీయ నులి పురుగుల నివారణ పోస్టర్లను విడుదల చేశారు. ఈ నెల 10న జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా విద్యార్థులచే ఆల్బెండజోల్ మాత్రలను మింగించాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాల లకు మాత్రలను అందజేస్తామని వైద్యాధికారులు డా.నవీన్ కుమార్, డా.శ్రీధర్ రెడ్డి అన్నారు. సూపర్‌వైజర్ భాగ్యలక్ష్మి, నాగలక్ష్మి, సంచార చికిత్స హెల్త్ అసిస్టెంట్ నాగన్న, తదితరులు పాల్గొన్నారు.

అంకిత భావంతో పనిచేయండి


సభ్యత్వాన్ని స్వీకరిస్తున్న న్యాయవాది

పత్తికొండ టౌన్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): అంకితభావంతో పనిచేస్తే రాణిస్తారని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రంగస్వామి, న్యాయవాదులు మైరాముడు, ఎల్లారెడ్డి, సత్యనారాయణ అన్నారు. శుక్రవారం బార్ అసోసియేషన్‌లో నూతన సభ్యత్వాన్ని స్వీకరించారు. ఆవుల శేఖర్, రమేష్‌బాబు, మల్లికార్జున, నాగభూషణం రెడ్డి, వీరన్న, అరుణ్ కుమార్, నరసింహయ్య పాల్గొన్నారు.

ఎరుకలను ప్రభుత్వం గుర్తించాలి


విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న నాయకులు

మద్దికెర, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): ఎరుకుల, గిరిజన కుటుంబాలను రాష్ట్ర ప్రభుత్వం గుర్తించి ఆదుకోవాలని ఆ సంఘం అధ్యక్షుడు మోహన్ కుమార్ ధర్మ, జేఏసీ కార్యనిర్వహణ అధ్యక్షుడు హంపా లక్ష్మన్న డిమాండ్ చేశారు. శుక్రవారం మండలంలోని మదనంతపురం గ్రామంలో రూ.5లక్షలతో ఏర్పాటు చేసిన ఏకలవ్య విగ్రహాన్ని ఆవిష్కరించారు. కులవృత్తిపై ఆధారపడ్డవారికి సంక్షేమ పథకాలు, కార్పొరేషన్ ఏర్పాటు చేసి ఆదుకోవాలని కోరారు. రాగుల రాముడు, సాకే గోవిందు, గాలేటి వీరన్న, కన్నదాత సుంకన్న, విగ్రహదాత లక్ష్మన్న పాల్గొన్నారు.

ఎస్పీని కలిసిన వీరభద్ర గౌడ్


ఎస్పీకి బొకే ఇస్తున్న వీరభద్ర గౌడ్

ఆలూరు, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్‌ను కర్నూలులోని ఎస్పీ కార్యాలయంలో టీడీపీ ఇన్‌చార్జి వీరభద్ర గౌడ్ కలిశారు. ఎస్పీని సన్మానించి, ఆలూరు నియోజకవర్గంలో శాంతి భద్రతలను కూడాపాలని కోరారు.

ట్రాక్టరు, స్కూటర్ ఢీ.. ఇద్దరికి గాయాలు

ఆస్పరి, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): మండంలోని కైరుప్పల గ్రామ సమీపంలో ట్రాక్టర్, స్కూటర్ ఢీ కొని ఇద్దరికి గాయాలైనట్లు సీఐ మస్తాన్ వలి శుక్రవారం తెలిపారు. వివరాల మేరకు.. గ్రామానికి చెందిన బండ్రత్ నాగరాజు ట్రాక్టర్‌తో పనులు ముగించుకుని వస్తుండగా చెన్నంపల్లి గ్రామానికి చెందిన గణపతి, పత్తికొండ నియోజకవర్గం దేవనబండ గ్రామానికి చెందిన సాతర సుధాకర్ చెన్నంపల్లికి వస్తూ ట్రాక్టరును ఢీ కొట్టారు. సుధాకర్, గణపతికి కాళ్లు విరగడంతో కర్నూలుకు తరలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

నిధులు కేటాయించాలి

- మంత్రిని కలిసిన వాల్మీకులు, రజకులు



మంత్రితో వాల్మీకి కార్పొరేషన్ చైర్‌పర్సన్ బొజ్జమ్మ, వినతి పత్రం ఇస్తున్న రజక కార్పొరేషన్ చైర్‌పర్సన్ సావిత్రి

దేవనకొండ, ఫిబ్రవరి (ఆంధ్రజ్యోతి): వాల్మీకి కార్పొరేషన్‌కు అధిక నిధులు కేటాయించాలని బీసీ సంక్షేమ మంత్రి సవితమ్మను కోరినట్లు చైర్‌పర్సన్ కప్పట్రాళ్ల బొజ్జమ్మ తెలిపారు. విజయవాడలోని గొల్లపూడి బీసీ సంక్షేమభవన్‌లో జరిగిన బీసీ కార్పొరేషన్ల సమావేశంలో నిధుల ప్రస్తావన తీసుకొచ్చామన్నారు.

వాల్మీకులు అన్ని రంగాల్లో వెనకబ డ్డారని, నిధులు కేటాయించి న్యాయం చేయాలన్నారు. మాజీ ఎంపీపీ రామచంద్రనాయుడు ఉన్నారు.

ఆదోని టౌన్: దోబీ ఘాట్లను నిర్మించి రజకులను ఆదుకోవాలని రజక వెల్ఫేర్ కార్పొరేషన్ చైర్‌పర్సన్ సావిత్రి కోరారు. శుక్రవారం బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవితకు విన్నవించారు. విజయవాడ గొల్లపూడి బీసీ భవన్‌లో జరిగిన కార్పొరేషన్ల చైర్‌పర్సన్ల సమీక్షా సమావేశంలో పాల్గొన్నారు. వెనుకబడిన రజకుల సంక్షేమానికి సహకరించాలని కోరగా, స్పందించిన మంత్రి సహకరిస్తారని హామీ ఇచ్చారని సావిత్రి తెలిపారు.

కబ్జాదారుడికి నోటీసులు

ఆదోని రూరల్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బైచిగేరి గ్రామంలో కబ్జాకు గురైన పంచాయతీ భవనాన్ని సోమవారంలోపు స్వాధీనం చేసుకుంటామని డీఎల్‌పీవో నూర్జహాన్, ఎంపీడీవో రాజేంద్ర ప్రసాద్ అన్నారు.


పంచాయతీ భవనం వద్ద సిబ్బంది

శుక్రవారం ఆంధ్రజ్యోతి దినపత్రిలో 'పంచాయతీ భవనం కబ్జా' శీర్షికన కథనాన్ని ప్రచురించింది. ఇందుకు అధికారులు స్పందించి వెంటనే స్వాధీనం చేసుకోవాలని సర్పంచ్ మహదేవ, కార్యదర్శి నాగరాజును ఆదేశాలు జారీ చేశారు. దీంతో సర్పంచు, కార్యదర్శి భవనాన్ని స్వాధీనం చేసుకోవడానికి వెళ్లగా నిర్వాహకుడు బంద్‌చేసి వెళ్లిపోయాడు. దీంతో నోటీసులను గోడకు అంటించి, సోమవారంలోపు భవనాన్ని అప్పగించాలని నిర్వాహకుడికి ఫోన్ ద్వారా తెలిపామని కార్యదర్శి అన్నారు.

'బీసీ' రుణాలకు 12 వరకు గడువు

తుగ్గలి, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం బీసీ కార్పొరేషన్ రుణాల గడువును ఈ నెల 12 వరకు పొడిగిచినట్లు ఎంపీడీవో విశ్వమోహన్ శుక్రవారం తెలిపారు. అర్హతగల బీసీ కులాల నిరుద్యోగులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

గర్భిణులు ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవాలి

మద్దికెర, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): గర్భిణులు తమ ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవాలనీ ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సౌభాగ్య లక్ష్మి, హెల్త్ ఎడ్యుకేటర్ అక్బర్‌బాషా పేర్కొన్నారు. శుక్రవారం అంగన్‌వాడీ కేంద్రంలో సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో బాల్య వివాహాల నిర్మూలనకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గర్భిణులు ఆకు కూరలను ఎక్కువగా వాడాలన్నారు. ప్రతి బుధవారం ఆసుపత్రిలో వైద్య పరీక్షలు చేయించుకోవాలని, ఆసుపత్రి లోనే ప్రసవం చేయించుకోవాలని కోరారు.

ఆడపిల్లల చదువుతో ఇంటికి వెలుగు

ఆదోని అగ్రికల్చర్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): ఆడపిల్లల చదువుతో ఇంటిల్లిపాదికి వెలుగు వస్తుందని ఎమ్మెల్యే పార్థసారథి పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ విద్యార్థులు ఫేర్‌వెల్‌డే వేడుకలను నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న బోజనాన్ని పునః ప్రారంభించిందన్నారు.ప్రిన్సిపాల్ సంజన్న, అధ్యాపకులు గోవిందరాజులు, వేదవతి, చిట్టిప్రసాద్, శాంతమ్మ, రాజేశ్వరి, ప్రభావతి, శివయ్య పాల్గొన్నారు.

'ఎస్సీ వర్గీకరణ సాధిస్తాం'

ఆలూరు, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): మందకృష్ణ మాదిగ నాయకత్వంలో ఎస్సీ వర్గీకరణను సాధంచి తీరుతామని ఎమ్మార్పీఎస్ రాయలసీమ జిల్లాల అధ్యక్షుడు చిప్పగిరి లక్ష్మీనారాయణ అన్నారు. శుక్రవారం హైద్రాబాద్‌లో పద్మశ్రీ పురస్కారానికి ఎంపికైన మందకృష్ణ మాదిగను అభినందించారు. కరెంటు గోవిందు మాదిగ, వినోద్, రామాంజినేయులు, శ్రీనివాస్, రంగ ఉన్నారు.

'శైలజానాథ్ వైసీపీలో చేరడం సిగ్గుచేటు'

పత్తికొండ టౌన్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీలో పదవులను అనుభవించిన మాజీ మంత్రి శైలజానాథ్ వైసీపీలో చేరడం సిగ్గుచేటని పార్టీ ఓబీసీ చైర్మన్ నాగార్జున యాదవ్ విమర్శించారు. శుక్రవారం మాట్లాడుతూ పార్టీలో పీసీసీ అధ్యక్షుడిగా, మంత్రి పదవులను అనుభవించి, నేడు కనీసం రెండంకెల సీట్లు కూడా లేని ఓ ప్రాంతీయ పార్టీలో చేరడం హాస్యాస్పదమన్నారు.

ప్రభుత్వమే నియామకాలు చేపట్టాలి

ఆలూరు, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వమే ఉద్యోగ నియామకాలను చేపట్టాలని మోడల్ స్కూల్ గర్ల్స్ హాస్టల్స్ ఔట్ సోర్సింగ్ వార్డెన్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షురాలు సుధారాణి కోరారు. శుక్రవారం మాట్లాడుతూ ప్రైవేటు ద్వారా నియామకాలు జరిపితే, పారదర్శకత లోపించి, ప్రతిభగల భ్యర్థులకు అన్యాయం జరుగుతుందన్నారు. అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను కాంట్రాక్టులోకి మార్చి జీతాలు ఇవ్వాలని కోరారు.

నైతిక బాధ్యతతో మెలగాలి

ఆదోని అగ్రికల్చర్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు సమాజం పట్ల నైతిక బాధ్యతతో మెలగాలని టూటౌన్ సీఐ సూర్య మోహన్ రావు సూచించారు. శుక్రవారం పట్టణంలోని బీమా ఇంజనీరింగ్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో రోడ్డు భద్రత వారోత్సవాలు నిర్వహించారు. ట్రాఫిక్ నిబంధనలను పాటించాలని డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలన్నారు. ర్యాష్ డ్రైవింగ్‌పై ప్రమాదాలపై విద్యార్థులకు వివరించారు. ర్యాగింగ్‌కు పాల్పడి జీవితాలను నాశనం చేసుకోవద్దు అన్నారు. ఎస్సై లక్ష్మన్న, కరస్పాండెంట్ విష్ణువర్ధన్ రెడ్డి, సురేష్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీఐ సూర్య మోహన్ రావు

గురుకులంలో నీటి సమస్య తీర్చండి

ఆదోని రూరల్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆరేకల్లు అంబేడ్కర్ గురుకుల బాలికల హాస్టల్‌లో నీటి సమస్య తీర్చాలని ప్రిన్సిపాల్ పద్మావతి కోరారు. శుక్రవారం ఉపాధ్యాయినులతో కలిసి ఎంపీడీవో రాజేంద్రప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. హాస్టల్‌లో సిబ్బందితో కలిపి 700మంది విద్యార్థులు ఉన్నారని, ఒకే బోరు ఉండటంతో సరిపోవడం లేదన్నారు. ఎమ్మెల్యే పార్థసారథి ఆదేశాల మేరకు మండల నిధుల నుంచి రూ.3లక్షలు విడుదల చేస్తున్నామని, వారంలోపు సమస్యను తీరుస్తామని ఎంపీడీవో హామీ ఇచ్చారు.

'స్మార్ట్ మీటర్లను ఉపసంహరించుకోవాలి'

తుగ్గలి, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): ప్రజలపై అదనపు భారం మోపే స్మార్ట్‌మీటర్ల ఏర్పాటును ఉపసంహరించుకోవాలని సీపీఎం కన్వీనర్ శ్రీరాములు డిమాండ్ చేశారు. శుక్రవారం విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద ధర్నా చేశారు. కేంద్రంలోని బీజేపీకి తలొగ్గిన గత వైసీపీ, ప్రస్తుత టీడీపీ ప్రభుత్వాలు స్మార్ట్ మీటరన్లు ఏర్పాటు చేయడం సరికాదన్నారు. ఈ కార్యక్రమంలో ఈశ్వరప్ప, రైతులు కృష్ణ, ముత్యాలయ్య తదితరులు ఉన్నారు.

విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించాలి

- పెద్దహరివాణం సీజనల్ హాస్టల్‌ను తనిఖీ చేసిన సబ్ కలెక్టర్


విద్యార్థులతో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్

ఆదోని, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించాలని ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం రాత్రి ఆయన మండలంలోని పెద్ద హరివాణం గ్రామంలో సీజనల్ హాస్టల్‌ను తనిఖీ చేశారు. విద్యార్థులతో మాట్లాడి వసతుల గూర్చి ఆరా తీశారు, హాజరు పట్టిక ప్రకారం విద్యార్థులు వసతి గృహంలో వుండేలా చూడాలని సూచించారు. ప్రభుత్వం అందిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకొని భవిష్యత్తులో ఉన్నత స్థాయికి ఎదగాలని విద్యార్థులకు సూచించారు.

గ్రామాలను శుభ్రంగా ఉంచుకోవాలి : ఎమ్మెల్యే


మాట్లాడుతున్న ఎమ్మెల్యే పార్థసారథి

ఆదోని రూరల్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): గ్రామాలను శుభ్రంగా ఉంచుకోవాలని ఉందని ఎమ్మెల్యే పార్థసారధి సూచించారు. ప్రజల కోసం పార్థసారధిలో భాగంగా శుక్రవారం అధికారులతో కలిసి దిబ్బనకల్లులో పర్య టించారు. ఎమ్మెల్యే స్వయంగా కాల్వలను శుభ్రం చేశారు. మురుగుతో కాల్వలు నిండిపోతే అధికారులు ఏం చేస్తున్నారని మండిపడ్డారు. ఇళ్లు లేనివారికి ఇంటిని నిర్మించి ఇస్తామని హామీ ఇచ్చారు .

పంటలను పరిశీలించిన జేసీ


రైతులతో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ నవ్య

వెల్దుర్తి, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని సూదేపల్లె గ్రామంలో ఉల్లి, వేరుశనగ పంటలను జేసీ నవ్య శుక్రవారం పరిశీలించారు. మార్కెట్‌లో ప్రస్తుతం ఉన్న ధర వివరాలను రైతులను అడిగి తెలుసుకున్నారు. రెవెన్యూశాఖ మరియు రైతుసేవా కేంద్రం సిబ్బంది నమోదు చేసిన పంట లను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయా ధికారి వరలక్ష్మి, తహసీల్దార్ చంద్రశేఖర వర్మ, హార్టికల్చర్ అధికారి నరేశ్‌రెడ్డి, ఏవో అక్బర్‌బాషా పాల్గొన్నారు.

కమనీయంగా రథోత్సవం


హోళగుంద, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): స్థానిక సిద్దేశ్వర స్వామి జాతర సందర్భంగా రథోత్సవం శుక్రవారం నిర్వహించినట్లు ధర్మకర్త రాజపంపన్న గౌడ్, శివ శంకర్ గౌడ్, సిద్ధార్థ గౌడ్ శుక్రవారం తెలిపారు. సాయంత్రం 7:30గంటలకు రథాన్ని లాగేందుకు భక్తులు పోటీపడ్డారు. ఆలూరు సీఐ వెంకట చలపతి ఆధ్వర్యంలో హోళ గుంద, ఆస్పరి, ఆలూరు, హాలహర్వి ఎస్సైలు భారీ బందోబస్తును ఏర్పాటు చేశారు.


రాత్రి 8 గంటల సమయంలో కొనసాగుతున్న రథోత్సవం

రైతుల కోసం కొనుగోలు కేంద్రాలు

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

- వ్యవసాయాధికారి నాగరాజు



హాలహర్వి, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి) : పంట దిగుబడులను కొనేందుకు ప్రభుత్వం రైతుల కోసం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసిందని వ్యవసాయ అధికారి శివశంకర్ అన్నారు.

ప్రశ్న: వ్యవసాయం జూదంగా మారిందని రైతులు ఆందోళన చెందుతున్నారు నిజమేనా?

జవాబు: వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో ఈ ఏడాది దిగుబడి తగ్గింది.

ప్రశ్న: ఈ ఏడాది ఖరీఫ్, రబీ దిగుబడులు ఎలా ఉన్నాయి.?

జవాబు: ఖరీఫ్‌లో వరి, ఎండుమిర్చి, కంది పంటలు దిగుబడులు బాగా తగ్గాయి.రబీలో కూడా అదే పరిస్థితి.

ప్రశ్న: ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎక్కడ ఏర్పాటు చేశారు?

జవాబు: హాలహర్విలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశాం. కంది , జొన్న, శనగ మాత్రమే కొంటున్నాం.

ప్రశ్న: రైతులకు పంటల బీమా ఉందా?

జవాబు: ఖరీఫ్‌లో పత్తి పంటకు బీమా ఇవ్వాలని ప్రతిపాదనలు పంపాం. ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తే రైతుల ఖాతాల్లో డబ్బులు జమ అవుతాయి.

ప్రశ్న: కూటమి ప్రభుత్వం రైతుల కోసం ఎలాంటి పథకాలు తెచ్చింది?

జవాబు: కూటమి ప్రభుత్వం 90 శాతం రాయితీతో యంత్రాలు, పనిముట్లు, డ్రిప్ ఇరిగేషన్ పరికరాలతో పాటు సంక్షేమ పథకాలు అమలు చేస్తోంది.

ప్రశ్న: సాగులో పెట్టుబడి భారాన్ని తగ్గించేందుకు చర్యలు తీసుకుంటున్నారా?

జవాబు: నానోయూరియా, నానో డీఏపీపై అవగాహన రైతులకు అవగాహర కల్పిస్తున్నాం. సేంద్రియ ఎరువులనే వాడాలని సూచిస్తున్నాం.

శ్రీమఠం భూములు అన్యాక్రాంతం కాకుండా చూడాలి



మఠం మేనేజర్‌కు వినతి పత్రం ఇస్తున్న నాయకులు

మంత్రాలయం, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయం రాఘవేంద్రస్వామి మఠానికి చెందిన భూములు అన్యాక్రాంతం కాకుండా చూడాలని విరాట్ హిందుస్థాన్ సంఘం నాయకులు రామాంజనేయులు తహసీల్దార్ ఎస్.రవికి, మఠం మేనేజర్-సీ సురేష్ కోనాపూర్‌కు వినతి పత్రాలు ఇచ్చారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ రాఘవేంద్రస్వామి భూములు చట్టవిరుద్ధంగా రైతులు ఆక్రమించుకుంటే వారికి రెవెన్యూ అధికారులు రికార్డుల్లో మార్చడం సరికాదని అన్నారు. రాఘవేంద్రస్వామి మఠం భూములు రైతుల పేరు తొలగించి మఠం పేరుతో నమోదు చేయాలని కోరారు. కార్యక్రమంలో హనుమంతు, గురుమూర్తి, మాదప్ప తదితరులు పాల్గొన్నారు.

నేడు ఏకాదశి పూజలు బంద్

మంత్రాలయం, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): మంత్రాలయం రాఘవేంద్రస్వామి మఠంలో శనివారం ఏకాదశి సందర్భంగా బృందావనానికి నిత్యం జరిగే అభిషేకాలు, అలంకరణ, నిత్య అన్నదానం, రథోత్సవాలు ఊరేగింపు, పరిమళ ప్రసాదం,టెంకాయ కొట్టడం బంద్ చేస్తారు. పీఠాధిపతులు సుబుదేంద్ర తీర్థుల ఆధ్వర్యంలో కేవలం బృందావనానికి నిర్మల విసర్జనం, క్షీరాబిషేకం నిర్వహించి మూలరాములకు పూజలు చేసి మహా మంగళ హారతులు ఇస్తారు. అలంకరణ లేని రాఘవేంద్రస్వామి నిజ బృందావనంను భక్తులు దర్శించుకొనే అవకాశం మాత్రమే శ్రీమఠం అధికారులు కల్పించనున్నారు. పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు, పండితులు, అర్చకులు, శ్రీమఠం ఉద్యోగులు ఉపవాసాన్ని పాటిస్తారు.

ఘనంగా యోగీంద్రతీర్థుల ఆరాధనోత్సవాలు

మంత్రాలయం, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): మంత్రాలయం రాఘవేంద్రస్వామి మఠం పూర్వపు పీఠాధిపతులైన యోగీంద్రతీర్థుల ఆరాధనోత్సవాలు ఘనంగా జరుపుకున్నారు. శుక్రవారం పీఠాధిపతి సుబుదేంద్రతీర్థుల ఆశీస్సులతో తమిళనాడులోని శ్రీరంగంలో వెలసిన యోగీంద్ర తీర్థుల బృందావనానికి నిర్మలవిసర్జనం, క్షీరాభిషేకాలు, విశేష పంచామృతాభిషేకం పూజలు నిర్వహించి మహామంగళ హారతులు ఇచ్చారు.

నల్లారెడ్డి స్వామి దశమి ఉత్సవం

పెద్దకడుబూరు, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో వెలసిన చింతలాముని నల్లారెడ్డి దశమి ఉత్సవాన్ని శుక్రవారం గ్రామ ప్రజలు ఘనంగా నిర్వహించారు. పెద్దకడుబూరులోని మాలవీధిలో వెలసిన నల్లారెడ్డి స్వామివారికి ప్రతియేటా మాదిరిగానే ఈఏడాది కూడా ఆకుపూజ, కుంకుమార్చన, పంచామృతాభిషేకం నిర్వహించారు. గ్రామంలోని ప్రజలకు మధ్యాహ్నం నుంచి రాత్రి 10గంటల వరకు భోజనాన్ని ఏర్పాటు చేశారు.

గుండె జబ్బులపై జాగ్రత్తగా ఉండాలి



కరపత్రాలను అందజేస్తున్న డాక్టర్ బాలాజీ

ఎమ్మిగనూరు టౌన్, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): గుండె జబ్బులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డాక్టర్ సుధా, డాక్టర్ బాలాజీ అన్నారు. శుక్రవారం పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో గుండె పోటుపై అవగాహన సదస్సు నిర్వహించారు. డాక్టర్లు మాట్లాడుతూ ప్రస్తుతం చిన్న పిల్లల నుంచి పెద్ద వారి వరకు గుండె పోటు సాధారణమైందన్నారు. ఛాతిలో నొప్పి వస్తే వెంటనే డాక్టర్ సంప్రందించాలని సూచించారు. ప్రభుత్వం ఆసుపత్రుల్లో గుండె పోటు చికిత్సలో భాగంగా రూ.40 వేలు విలువైన టెనెక్టెప్లస్-40 ఇంజక్షన్‌ను ఉచితంగా వేస్తామని అన్నారు. అనంతరం కరపత్రాలను విడుదల చేశారు. కార్యక్రమంలో డాక్టర్ రవి, హెడ్ నర్సులు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

లేగదూడల పెంపకంపై అవగాహన



మాట్లాడుతున్న వెంకటరమణ

కౌతాళం, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని బాపురం గ్రామంలో శుక్రవారం లేగదూడల పెంపకంపై ప్రజలకు అవగాహన సదస్సును పశు వైద్యాధికారులు చేపట్టారు. ఈ సదస్సును కౌతాళం పశువైద్యాధికారి జగదీష్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆదోని డివిజన్ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ వెంకటరమణ మాట్లాడుతూ లేగదూడల పెంపకం వల్ల ఎన్నో లాభాలు ఉన్నాయని పశు యజమానాలు లేగదూడల పెంపకంపై అవగాహన కలిగి ఉండాలన్నారు. పెంపకంలో యాజమాన్యం చేపట్టాల్సిన విధానాలు, నట్టల నివారణ, కృత్రిమ గర్భాధారణపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డీఎల్‌డీఏ డాక్టర్ రాజశేఖర్, పశువైద్యాధికారులు జగదీష్ బాబు, మహేశ్వరి ఉన్నారు.

ఘనంగా హాల్వి సిద్ధేశ్వర స్వామి రథోత్సవం



రథాన్ని లాగుతున్న భక్తులు

కౌతాళం, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని హాల్వి గ్రామంలో వెలసిన సిద్ధేశ్వర స్వామి జాతర శుక్రవారం భక్తుల సమక్షంలో ఘనంగా జరిగింది. ఆలయ అర్చకులు స్వామి వారి మూలవిరాట్‌ను ప్రత్యేక పుష్పాలంకరణతో అలంకరించి స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. రథోత్సవంలో చుట్టు పక్కల గ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా కౌతాళం సీఐ అశోక్ కుమార్. కోసిగి ఎస్ఐ చంద్రమోహన్‌తో పాటు 15 మంది పోలీసు బందోబస్తును ఏర్పాటు చేసినట్లు సీఐ అశోక్ కుమార్ తెలిపారు.

రథోత్సవంలో పాల్గొన్న నాయకులు

స్వామివారి రథోత్సవంలో టీడీపీ మండల అధ్యక్షుడు ఉలిగయ్య, నాయకులు మాధవరం రామకృష్ణారెడ్డి, సతీష్ నాయుడు, దర్గా ఖాదర్ బాషా, చిన్న సిద్దయ్య, కుంటనహల్ మారెప్ప పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.

టౌన్ బ్యాంకు సేవలను విస్తరిస్తాం

ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి

ఎమ్మిగనూరు, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు కో-ఆపరేటివ్ టౌన్ బ్యాంకు సేవలను అన్ని గ్రామీణ ప్రాంతాలకు విస్తరింపజేస్తామని ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరెడ్డి అన్నారు. ప్రభుత్వం ఇటీవల కొత్తగా నియమించిన ది-ఎమ్మిగనూరు కో-ఆపరేటివ్ టౌన్ బ్యాంకు పాలక మండలి సభ్యుల ప్రమాణ స్వీకారం శుక్రవారం ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. టౌన్ బ్యాంకు ఆవరణలో ఏర్పాటు చేసిన ప్రమాణ స్వీకరోత్సవ కార్యక్రమంలో ఛైర్మన్ ఉరుకుందయ్యశెట్టి, వైస్ ఛైర్మన్ బండా నరసప్ప, సభ్యులుగా యు.కె. రవికుమార్, దోమ భీమేష్, వెంకటేశ్వరరెడ్డి, యం. మహబూబ్, షాలేము, వెంకటగిరి, నరసింహులు, నవీణ్‌కుమార్‌లతో ఎమ్మెల్యే ప్రమాణ స్వీకారం చేయించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఐదేళ్లకాలంలో బ్యాంకు ఎన్‌పీఏను పూర్తిగా తగ్గించారని, అయితే గత వైసీపీ ప్రభుత్వంలో ఎన్‌పీఏ తిరిగి 11 నుంచి 14 శాతం పెరిగిందన్నారు. ఇది బ్యాంకు ఆర్థిక పరిస్థితికి విఘాతం కలిగిస్తుందన్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకొని పాలక మండలి బ్యాంకు అభివృద్ధి కోసం కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో డీసీవో రామాంజనేయులు, స్థానిక నాయకులు వై.పీ.ఎం కొండయ్య చౌదరి, ముగతి ఈరన్నగౌడు, రాందాసుగౌడు, మిఠాయి నరసింహులు, ముల్లాఖలీముల్లా, తురేగల్ నజీర్, హాజీ బడేసాబ్, ఫారుక్, బందెనవాజ్, కనికె నాగరాజు, షాబీర్, చేనేత మల్లి, సోడాల శ్రీను, ఇషాక్, వాహిద్, బ్యాంకు సీఈవో గడిగె కళ, మాజీ సీఈవో గంగాధర్, జనసేనా, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

హంద్రీనీవా నీటిని విడుదల చేయండి

గోనెగండ్ల: ఎర్రబాడు చెరువుకు హంద్రీనీవా నుంచి నీటిని వెంటనే విడుదల చేయాలని ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి హంద్రీనీవా ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆయన ఎర్రబాడు గ్రామంలో హంద్రీనీవా డీఈఈ వరప్రసాద్, లక్ష్మీనాయక్, ఏఈ నజీర్, ఆగ్రామ టీడీపీ నాయకులు, రైతులతో సమావేశమయ్యారు. ఎర్రబాడు చెరువు పరస్థితిని హంద్రీనీవా కాలువల పరస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామంలో కొందరు చెరువులకు నీటి విడుదల చేస్తామంటు రైతుల దగ్గర సొమ్మును వసూళ్లు చేయడం తప్పుపట్టారు. చెరువుకు నీరు విడుదల అయితే ఎర్రబాడుతోపాటు చుట్టపక్కల ఉన్న గ్రామాలకు సాగునీటితో పాటు తాగునీరు, వేసవిలో భూగర్భ జలాలు అడుగంటి పోకుండా ఉంటాయని, నీటిని హంద్రీనీవా నుంచి విడుదల చేయిస్తున్నామన్నారు. అయితే హంద్రీనీవా నుంచి ఎర్రబాడు చెరువుకు వచ్చే హంద్రీనీవా కాలువలు దెబ్బతిన్నాయని, వాటిని మర్మమతు చేయించాలని రైతులు కోరడంతో వెంటనే దెబ్బతిన్న కాలువలకు సంబంధించి ఎస్టీమెట్ వేసి రెండు మూడు రోజులలో ఇవ్వాలని డీఈఈ, ఏఈలకు ఆదేశించారు. అనంతరం ఇరిగేషన్ అధికారులు దెబ్బతిన్న హంద్రీనీవా కాలువల దగ్గర కువెళ్లి పరిశీలించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మాజీ సర్పంచ్ ఎర్రబాడు శ్రీనివాసులు, మౌలా, షెక్షావలి, ఏసు, ముళ్ల హుసేన్, కుమార్, హుస్సేన్ పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతితో అధిక దిగుబడులు



మిరప పంటను పరిశీలిస్తున్న జపాన్ బృందం

గోనెగండ్ల, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): రైతులు యాజమాన్యపద్ధతులు పాటించి అధిక దిగుబడులను సాధించవచ్చునని ధనూకా జపాన్ బృందం సభ్యులు సాజల్ బిస్వాస్ సాన్, పూజితా సాన్ అన్నారు. శుక్రవారం వీరంపల్లి గ్రామంలో మిరపలో బూడిద తెగులు నివారణ చర్యల రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ధనూకా కంపెనీ వారు రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. సాగు చేసిన ఉల్లి, మిరప తోపాటు పలు పంటలను వారు పరిశీలించారు. వారు మాట్లాడుతూ మిరప, ఉల్లి, వేరుశనగ, తదితర పంటలలో బూడిద తెగులు అధికంగా వస్తుందన్నారు. ఈ తెగులు లావెల్లులా టౌరికా అనే ఫంగస్ వల్ల వస్తుందని, ఈ తెగులు సోకిన వెంటనే ఆకు దిగువ భాగంలో చిన్న తెల్లటి మచ్చలు కనిపిస్తాయని ఫంగస్ పెరుగుదలను బట్టి ఆకుపై భాగంలో లేత పసుపు రంగు మచ్చలు వ్యాపిస్తాయని తెలిపారు. ఇందుకు కాను నిస్సోడియమ్ అనే మందును వాడాలని రైతులకు సూచించారు. అలాగే పలు రకాల పంటలలో రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను, యాజమాన్య పద్ధతులను, పంటసాగుకు ముందు వాలుకు అడ్డగా దున్నడం వల్ల కలిగే ఫలితాను వారు వివరించారు. కార్యక్రమంలో కంపెనీ జనరల్ మేనేజర్ హుస్సేన్ వలి, డీజీఎం పరశురామయ్య లోకేశ్వరరెడ్డి, మోహన్‌రెడ్డి, ఎల్‌బీ వెంకటేశ్వర్లు, కే. శ్రీనివాసులు, కర్నూలు టీమ్ సభ్యులు, వీరంపల్లి, తిప్పనూరు, గ్రామాల రైతులు పాల్గొన్నారు.

ఆలిండియా సంస్కృత్‌లో పీఠాధిపతి



పీఠాధిపతికి గ్రంథాన్ని ఇస్తున్న నిర్వాహకులు

మంత్రాలయం, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయం రాఘవేంద్రస్వామి మఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు ధార్మిక పర్యటనలో భాగంగా శుక్రవారం డిల్లీకి బయలుదేరివెళ్లారు. ఉదయం 5 గంటలకు మంత్రాలయం నుంచి హైదరాబాదుకు కారులో వెళ్లి అక్కడి నుంచి విమానంలో వెళ్లారు. ఆలిండియా సంస్కృత్ బుక్ ఫైర్ కార్యక్రమంలో పాల్గొని సంస్కృత పండితులు, వేదాంత విద్వాంసులతో చర్చించారు. అక్కడ లభించే సంస్కృత గ్రంథాలను పరిశీలించారు. ఇటీవలే ఆవిష్కరించిన గ్రంథాలను అక్కడి నిర్వాహకులు పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులకు అందజేశారు. పీఠాధిపతి మాట్లాడుతూ న్యూఢిల్లీలో ఇలాంటి సంస్కృత్ విద్యావ్యాప్తి కోసం ఆలిండియా సంస్కృత్ ఫైర్ ఏర్పాటు చేయడం సంతోషించదగ్గ విషయమన్నారు. పీఠాధిపతి వెంట శ్రీమఠం విచారణకర్త శ్రీనివాస్‌ఖస్బే, రాజాఎస్ అప్రమేయాచార్, ప్రకాష్‌ఆచార్, ద్వారపాలక అనంతస్వామి, పవన్ కుమార్ ఉన్నారు.

ఆధార్ తరహాలో రైతులకు ఐడీ నెంబర్



మాట్లాడుతున్న ఏవో వరప్రసాద్

పెద్దకడుబూరు, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): ఆధార్ నెంబర్ తరహాలోనే రైతులకు కూడా ప్రభుత్వం ఐడీ నెంబర్‌ను కేటాయిస్తుందని ఏవో వరప్రసాద్ తెలిపారు. శుక్రవారం పెద్దకడుబూరులో రైతు సేవా కేంద్రంలో ఆయన మాట్లాడుతూ రైతులకు ఐడీ నెంబర్‌తో ఎంతో ఉపయోగం ఉంటుందన్నారు. 21 అంకెలతో ఈ నెంబర్ ఉంటుందని, వాతావరణ మార్పులపై ఎప్పటికప్పుడు సమాచారం అందజేస్తుందన్నారు. అలాగే పంటనష్టం, ప్రకృతి వైపరీత్యాలు, బీమా పరిహారం మంజూరు చేయడంలో ఈ గుర్తింపు కార్డులు ఉపయోగపడతాయన్నారు.

కోచింగ్ సెంటర్‌పై చర్యలు తీసుకోవాలి



డిప్యూటీ తహసీల్దార్‌కు వినతి పత్రం ఇస్తున్న నాయకులు

ఎమ్మిగనూరు టౌన్, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): నిరుద్యోగుల నుంచి వేలకు వేలు ఫీజులు వసూలు చేస్తున్న కోచింగ్ సెంటర్‌పై చర్యలు తీసుకోవాలని ఆర్‌పీఎస్ఎఫ్, ఆర్‌యూఎస్ఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం ఆర్‌పీఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి షాహిద్ అఫ్రిది, ఆర్‌యూఎస్ఎఫ్ రఘునాథ్ మాట్లాడుతూ పట్టణంలోని రాఘవేంద్ర కాలనీలో ఉన్న కోచింగ్ సెంటర్ డీఎస్సీ కోచింగ్ పేరిట నిరుద్యోగుల నుంచి వేలకు వేలు వసూలు చేస్తున్నాడన్నారు. కోచింగ్ సెంటర్‌లో చేరేటప్పుడు కేవలం ఆరు నెలలు కోచింగ్ అని చెప్పి, ఇప్పుడు పది నెలలు కావస్తున్నా కోచింగ్ పేరిట వులకు వేలు ఫీజులు వసూలు చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో షెక్షావలి, పవన్ పాల్గొన్నారు.

రోడ్డుపైనే నీరు

ఇబ్బంది పడుతున్న ప్రజలు



దుద్ది-హాల్వి ప్రధాన రోడ్డుపై నిల్వ ఉన్న లీకేజీ నీరు

కోసిగి, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని దుద్ది, హాల్వికి వెళ్లే ప్రధాన రోడ్డుపై లీకేజీ నీరు నిల్వ ఉంటోంది. దీంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. దుద్ది చెరువు సమీపంలో కల్వర్టు రోడ్డు దగ్గర చెరువు లీకేజీ నీరు రోడ్డుపైనే నిల్వ ఉండటంతో లీకేజీ నీటి దగ్గర సడన్ బ్రేక్ వేసే సమయంలో అదుపు తప్పి వాహనదారులు కింద పడుతున్నారు. గత ఆరు నెలల నుంచి చెరువు లీకేజీ నీరు దుద్ది హాల్వి రోడ్డుపై పారుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. అధికారులు స్పందించి రోడ్డుపై నీటి నిల్వ ఉండకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

ఘనంగా వాసవీ కన్యకాపరమేశ్వరి విగ్రహ ప్రతిష్ఠ

కోసిగి, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): కోసిగిలోని సిద్దప్పపాలెంలోని ఊరువాకిలి సమీపంలో వాసవీ కన్యకాపరమేశ్వరి నూతన ఆలయ, విగ్రహ ప్రతిష్ఠ ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కర్నూలు టీడీపీ జిల్లా అధ్యక్షుడు పాలకుర్తి తిక్కారెడ్డి, మంత్రాలయం టీడీపీ యువ నాయకులు రామకృష్ణారెడ్డి, పెండ్యాల రవితేజ శెట్టి, భరద్వాజ శెట్టి, సాతనూరు మంజునాథ్, నాడిగేని అయ్యన్న, చింతలగేని నర్సారెడ్డి, పంపాపతిలు హాజరయ్యారు అనంతరం ఆర్యవైశ్యులు వీరికి పూలమాలలు వేసి, శాలువలతో సన్మానించారు. ఆర్యవైశ్యులకు కూటమి ప్రభుత్వం పెద్దపీట వేసిందని, రాష్ట్ర మంత్రిగా టీజీ భరత్‌ను, కర్నూలు కుడా ఛైర్మన్‌గా సోమిశెట్టి వెంకటేశ్వర్లుకు ఉన్నత పదవులు ఆర్యవైశ్యులకు కట్టబెట్టిందని తిక్కారెడ్డి అన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు జ్ఞానేష్, గాలెం వీరేష్, పోతుల వీరారెడ్డి, లక్ష్మీనారాయణ, మహదేవ, రామాంజనేయులు, ఉలగయ్య, దుబ్బిరెడ్డి, హనుమంతు తదితరులు ఉన్నారు.



అమ్మవారిని దర్శించుకున్న టీడీపీ రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరెడ్డి



అమ్మవారిని దర్శించుకుంటున్న టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి

దేవమ్మ అవ్వ విగ్రహ ప్రతిష్ఠ

కౌతాళం: మండలంలోని ఉప్పరహల్ గ్రామంలో నూతనంగా నిర్మించిన దేవమ్మవ్వ దేవాలయంలో శుక్రవారం అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం వైభవంగా జరిగింది. ఆలయ కమిటీ నిర్వాహకులు, అమ్మవారి భక్తుల సమక్షంలో ప్రత్యేక హోమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి టీడీపీ రాష్ట్ర కార్యదర్శి ప్యాలకుర్తి శ్రీనివాసరెడ్డి మండల టీడీపీ నాయకులతో కలిసి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. వీరి వెంట టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు చెన్నబసప్ప, బీసీ నియోజకవర్గ కార్యదర్శి కురుగోడు, సౌద్రి సోమశేఖర్ ఐటీడీపీ సభ్యులు సల్మాన్ రాజు, టీబీపీ ఛైర్మన్ టిప్పుసుల్తాన్, రైతు విభాగం జిల్లా కార్యదర్శి వెంకటపతి రాజులు ఉన్నారు.

ఘనంగా ఆలయ ప్రతిష్ఠ



వాల్మీకి విగ్రహాన్ని ఆవిష్కరించి నమస్కరిస్తున్న ఎమ్మెల్యే

గోనెగండ్ల, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఐరన్‌బండ గ్రామంలో నూతనంగా నిర్మించిన సుంకులాపరమేశ్వరి దేవి ఆలయం, సుంకులాపరమేశ్వరి, మారెమ్మ దేవి, లింగమయ్య స్వామి, గోపురకళశం, ధ్వజస్తంభం, బొడ్రాయి, వాల్మీకి మహర్షి విగ్రహ ప్రతిష్ఠ శుక్రవారం ఘనంగా నిర్వహించారు. అంతకుముందు అర్చకులు యాగాలు నిర్వహించారు. సుంకులాపరమేశ్వరి, మారెమ్మదేవికి ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రత్యేక పూజలు చేశారు.

కోసిగిలో వీధి కుక్కల బెడద



కోసిగి ప్రధాన రోడ్డుపై పడుకున్న వీధి కుక్కలు

కోసిగి, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): కోసిగిలో రోజురోజుకు కుక్కల బెడద తీవ్రమమైంది. ప్రధాన రోడ్లపై పదుల సంఖ్యలో కుక్కలు రోడ్డుపై అడ్డంగా పడుకుని ఉండటంతో వాహనదారులు తప్పించబోయి ప్రమాదాల బారిన పడుతున్నారు. మార్కెండేయ స్వామి దేవాలయం నుంచి ఆర్టీసీ బస్టాండు వరకు ప్రధాన రోడ్డుపై మాంసం దుకాణాలు ఉండడంతో వారు వేసే చికెన్ ముక్కల కోసం ఎగబడి కుక్కలు గుంపులు గుంపులుగా వస్తున్నాయి. అటువైపు వెళ్తున్న వాహనదారులపై దాడి చేస్తున్నాయి. గురువారం కోసిగిలోని సజ్జలగుడ్డం రోడ్డులో కుక్కలు అడ్డురావడంతో కర్ణాటకకు చెందిన భార్యాభర్తలు, ఇద్దరు పిల్లలు బైక్ అదుపు తప్పి గాయాలపాలయ్యారు. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు ప్రధాన రోడ్లపై ఉన్న కుక్కలను బంధించి వేరే చోటకు తరలించాలని ప్రజలు కోరుతున్నారు.

మంచాలమ్మకు విశేష పంచామృతాభిషేకం

మంత్రాలయం, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): మంత్రాలయం రాఘవేంద్ర స్వామి మఠంలో వెలసిన గ్రామదేవత మంచాలమ్మ దేవతకు విశేష పంచామృతాభిషేకం నిర్వహించారు. శుక్రవారం పుష్యమాసం దశమిని పురష్కరించుకొని మఠం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థుల ఆశీస్సులతో ఉదయం నుంచి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. నిర్మలవిసర్జనం, క్షీరాభిషేకం, కుంకుమ సేవ, విశేష పంచామృతాభిషేకం చేసి పట్టుచీర, బంగారు,వెండి ఆభరణాలుతో పాటు వివిధ రకాల పుష్పాలు, ప్రత్యేక అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. పండితులు మహ మంగళహారతులు ఇచ్చారు.

నేడు రంగస్వామి రథోత్సవం

ఎమ్మిగనూరు రూరల్ , ఫిబ్రవరి7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దేవిబెట్ట గ్రామంలో వెలసిన రంగస్వామి రథోత్సవాన్ని శనివారం అంగరంగ వైభవంగా నిర్వహించనున్నారు. జాతరను పురస్కరించుకొని గ్రామంలో కోలాటాలతో పాటు 9న అంతరాష్ట్ర బండలాగుడు ఒంగోలు ఎద్దుల బల ప్రదర్శనను ఏర్పాటు చేసినట్లు గ్రామ పెద్ద సోమేశ్వరరెడ్డి తెలిపారు.

మాచాని సోమప్ప పాఠశాల వార్షికోత్సవం



నృత్యం చేస్తున్న విద్యార్థినులు

ఎమ్మిగనూరు, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరులోని మాచాని సోమప్ప ఉన్నత పాఠశాల 47వ వార్షికోత్సవం శుక్రవారం ఘనంగా జరిగింది. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శారద ఆధ్వర్యంలో వార్షికోత్సవాన్ని ఉదయం ఎన్‌సీసీ పెరెడ్ కార్యక్రమాన్ని నిర్వహించి జాతీయ జెండాను ఎగురవేశారు. సాయంత్రం విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు సభికులను ఎంతగానో అలరించాయి. ఈ కార్యక్రమానికి ప్రముఖ అతిథులుగా వైద్యులు డాక్టర్ మాలకొండయ్య, కరస్పాండెంట్ తారకేశ్వర్, ఏవో కృష్ణయ్య లు పాల్గొన్నారు. డాక్టర్ మాలకొండయ్య మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే ఓ లక్ష్యాన్ని నిర్ణయించుకొని అందుకోసం కృషి చేయాలన్నారు. విద్యార్థి దశలో కష్టపడిన ప్రతి ఒక్కరు జీవితంలో ఉన్నత శిఖరాలను చేరుకుంటారన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

బడేసాహెబ్ స్వామికి వెండి పాదుకలు



వెండిపాదుకలకు పూజలు నిర్వహిస్తున్న పీఠాధిపతి

గోనెగండ్ల, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): గంజహళ్లి గ్రామంలో వెలసిన మహత్మబడేసాహెబ్ స్వామి వారికి గంజహళ్లి గ్రామానికి చెందిన త్రివిక్రంరెడ్డి, అతని తల్లిదండ్రులు ప్రతాపరెడ్డి, అరంజ్యోతి దంపతులు స్వామివారికి రూ. 70వేలు విలువ చేసే వెండి పాదుకలను శుక్రవారం దర్గ ధర్మకర్త కుబేర్‌రెడ్డి కు అందజేశారు. దర్మకర్త స్వామి వారి పాదుకలను బడేసాహెబ్ స్వామి వారి మునిమనవడు పీఠాధిపతి చిన్న ముద్దుగోలు స్వామి చే ప్రత్యేక పూజలు చేయించారు. స్వామివారికి అందజేసిన పాదుకలను భక్తుల దర్శనార్థం స్వామి వారి జీవసమాధి దగ్గర ఉంచారు. ఈ కార్యక్రమంలో దర్గా సోసైటీ సభ్యులు దర్గా బడేసాహెబ్, చిన్నఖాసీంవలి, భక్తులు ఉన్నారు.

'చంద్రబాబుతోనే బీసీలకు రాజ్యాధికారం'

గోనెగండ్ల, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): బీసీలకు రాజ్యాధికారం సీఎం చంద్రబాబునాయుడి తోనే సాధ్యం అవుతుందని రాష్ట్ర కురువ కార్పొరేషన్ డైరెక్టర్ రామకృష్ణ అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ నామినేటెడ్ పదవులలో బీసీలకు 34 శాతం రిజర్వేషన్‌లను కల్పిస్తూ క్యాబినేట్ అమోదం తెలపడం చారిత్రాత్మక నిర్ణయం అని ఆయన కొనియాడారు. కూటమి ప్రభుత్వం బీసీలకు అగ్రతాంబులం ఇచ్చిందని గత వైసీపీ ప్రభుత్వం బీసీ రిజర్వేషన్ 29 శాతానికి తగ్గించి బీసీలకు తీరని అన్యాయం చేసిందన్నారు. ఎన్నికలలో టీడీపీ బీసీలకు ఇచ్చిన హామీని నెరవేర్చిందని టీడీపీ బీసీల అభ్యున్నతి కోరే పార్టీ అని మరోసారి నిరూపించిందని తెలిపారు. బీసీల తరపున సీఎం చంద్రబాబునాయుడికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని తెలిపారు. ఈకార్యక్రమంలో టీడీపీ నాయకుడు రాముడు, కురువ సంఘం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మహబూబ్ నగర్ కాలనీలో చోరీ

ఎమ్మిగనూరు టౌన్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మహబూబ్‌నగర్ కాలనీలో పట్టపగలు చోరీ జరిగింది. శుక్రవారం వడ్ల శంకరమ్మ నర్సాచారి భార్యాభర్తలు ఇంటికి తాళం వేసి పక్క వీధిలో ఉన్న బంధువుల ఇంటికి వెళ్లారు. ఇది గమనించిన దొంగలు ఇంట్లోకి చొరబడి బీరువా తాళాలు పగలగొట్టి బిరువాలో ఉన్న 4 బంగారం గాజులు, ఒక లాంగ్ చైను ఎత్తుకెళ్లారు. సాయంత్రం ఇంటికి వచ్చి చూసే సరికి బీరువా తెరిచి ఉండడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ సీఐ శ్రీనివాసులు తెలిపారు.